నవతెలంగాణ
మహబూబ్‌నగర్
మంగళవారం ఫిబ్రవరి 20, 2024 www.navatelangana.com



## తెలంగాణ రాష్ట్ర తైక్వాండో అసోసియేషన్ ఈసీ మెంబర్ గా సురేందర్ బాబు

నవ తెలంగాణ-మహబూబ్ నగర్



తెలంగాణ రాష్ట్ర తైక్వాండో అసోసియేషన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్ గా మహబూబ్ నగర్ కు చెందిన సీనియర్ క్రీడాకారుడు కె.సురేందర్ బాబు ఎన్నికయ్యారు. గద్వాల పట్టణంలో తెలంగాణ రాష్ట్ర తైక్వాండో అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ కార్యవర్గంలో సురేందర్ బాబును ఈసీ మెంబర్ గా ఎన్నిక చేస్తూ నియామకపత్రం అందజేశారు. సురేందర్ బాబు ప్రస్తుతం జిల్లా తైక్వాండో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా వ్యవహరిస్తున్నారు. సోమవారం సురేందర్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్ గా నాలుగేళ్లపాటు అవకాశం కల్పించిన నూతన రాష్ట్ర అధ్యక్షులు ముత్త శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి శ్రీహరిలకు కృతజ్ఞతలు తెలిపారు.సురేందర్ బాబు ఎంపికపై జిల్లా తైక్వాండో అసోసియేషన్ ప్రతినిధులు ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు.

## అక్రమ ఇసుక టిప్పర్ల పట్టివేత

నవతెలంగాణ- జడ్చర్ల టౌన్



ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న టిప్పర్లను పట్టుకొన్నట్లు స్థానిక సీఐ ఆదిరెడ్డి తెలిపారు.మండల పరిధిలోని ఉదండాపూర్ రిజర్వాయర్ వద్ద నీటి కుంటలో పిల్టర్ ఇసుక తయారు చేస్తూ ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారానే సమాచారంతో అక్కడికి వెళ్తుండగా 5 టిప్పర్లు ఇసుకతో కూడిన టిప్పర్లు వస్తూ పోలీస్ వాహనాలను చూసి డ్రైవర్లు వాహనాలను వదిలి పారిపోయారని తెలిపారు.5 టిప్పర్లను పోలీస్ స్టేషనకు తీసుకువచ్చి కేసులు నమోదు చేయడం జరిగిందని తెలిపారు.ప్రభుత్వ నిబంధనలు ఉల్లంగించి ఎవరైనా అక్రమంగా ఇసుక తరలిస్తే పి డి యాక్టుల కింద కేసు నమోదు చేస్తామని చెప్పారు.

## లక్ష 60 వేల సైనికుల పోస్టులు భర్తీ చేయండి



మహబూబ్ నగర్ : భారతదేశ సైన్య కుల పోస్టులలో ఖాళీగా ఉన్న లక్ష అరవై వేల పోస్టులు వెంటనే భర్తీ చేయాలని కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి హర్షవర్ధన్ రెడ్డి బిజెపి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ప్రెస్ మీట్ లో ఆయన మాట్లాడుతూ భారత ప్రధాని నరేంద్ర మోడీ 2022 జూన్ 14 న తెచ్చిన అగ్నిపత్ పథకం సైనికులను మోసం చేసే విధంగా ఉందన్నారు. 2022 జూన్ 14న అమల్లోకి తెచ్చిన అగ్నిపత్ పథకాన్ని సెప్టెంబర్ 2022 లో అమలు చేస్తామని ఇప్పటి వరకు అమలు చెయ్యలేదని ఆరోపించారు.ఇప్పటివరకు సైన్యంలో 1,60,000 వేల ఖాళీలు ఉన్నాయన్నారు. వాటిని వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. 2019- 2020- 2021 లో సైనికుల ఖాళీల భర్తీ చేయలేదని వారు గుర్తు చేశారు. దేశవ్యాప్తంగా 19.64.000 వేల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయి వెంటనే వీటిని భర్తీ చేయాలని కోరారు.అగ్నిపత్ పథకం నిరుద్యోగులను మోసం చేసే పథకం అని మా రాహుల్ గాంధీ డే వన్ నుంచి వ్యతిరేకిస్తున్నాడు కావున ఈ అగ్నిపత్ పథకాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో సీజే బెనహరి ,కార్యకర్తలు పాల్గొన్నారు.

## నూతన చెక్‌డ్యాం శంకుస్థాపన



బాలానగర్ : వాగులపైన చెక్‌డ్యాములు నిర్మించుకుంటే భూగర్భ జలాలు పెరుగుతాయని అందుకే రాజాపూర్. బాలానగర్ వాగుల పైన చెక్‌డ్యాం నిర్మిస్తే నీరు నిల్వ ఉండటంతో భూగర్భ జలాలు పెరుగుతాయని నేపంతో గతంలోనే రెండు మం జూరు కాగా సోమవారం బాలానగర్ మండల పరిధిలోని కేతిరెడ్డిపల్లి. సూరారం వాగుల వద్ద చెక్‌డాంలను జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి శంకుస్థాపన చేశారు. వాగులపైన చెక్ డ్యాములు నిర్మించుకుంటే నీరు నిల్వ ఉండటంతో నీటిమట్టం పెరుగుతూ బోరుబావులలో నీటిమట్టం పెరుగుతూ అధిక దిగుబడికి సాగవుతుందని ఆయన అన్నారు.అనంతరం చత్రపతి శివాజీ జయంతి పురస్కరించుకొని అయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మోతీ ఖానాపూర్ గ్రామంలో చత్రపతి శివాజీ విగ్రహాన్ని ఆవిష్కరించారు.ఆయన వెంట మండల జెడ్పీటీసీ సభ్యురాలు జెర్పుల కళ్యాణి ,జిల్లా గిరిజన నాయకులు లక్ష్మణ్ నాయక్, జిల్లా ఓబీసీ సెల్ అధ్యక్షులు తిరుపతి, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మామిడి గుట్ట శంకర్ నాయక్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు గుమ్మల్ల వెంకటేశ్వర్ రెడ్డి, క్రషర్ వెంకట్ రెడ్డి, దత్తాత్రేయ,గుండేటి మాజీసర్పంచ్ నరసింహారెడ్డి, కేతిరెడ్డిపల్లి మాజీ సర్పంచ్ సుధాకర్ రావు, మూతి ఘనపూర్ గ్రామ నరసింహారెడ్డి, తిరుమలగిరి కి చెందిన మోహన్ నాయక్ పాల్గొన్నారు.

## 'సీఎం సహకారంతో మిడ్జిల్‌ని అభివృద్ధి చేస్తా'



మిడ్జిల్ :రాజకీయాలకు అతీ తంగా మిడ్జిల్ మండలాన్ని ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో అన్ని గ్రామాలకు డబల్ బీటీ రోడ్డులు మంజూరు చేయి స్తానని ఐదు సంవత్స రాలలో జడ్చర్ల నియోజకవర్గం పార్టీలకతీతంగా అభివృద్ధి చేసి చూపిస్తానని జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుద్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో సంగమేశ్వర గ్రామీణ బ్యాంకు వారి సహకారంతో ఏర్పాటు చేసిన నూతన ట్రాక్టర్ను ప్రారంభించారు. ఎంపీడీవో సమావేశం మందిరంలో స్థానిక ప్రజా ప్రజా ప్రతినిధులతో కలిసి షాది ముబారక్, కళ్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, గతంలో ఉన్న ప్రభుత్వం పది సంవత్సరాలు చేసిన అభివృద్ధి రెండు నెలల్లోనే నియోజకవర్గ అభివృద్ధికి ఎన్నో నిధులు తీసుకొచ్చానని తెలిపారు. ప్రతిరోజు నియోజకవర్గ అభివృద్ధి కోసమే కష్టపడి పని చేస్తున్నానని ప్రతిపక్ష నాయకులు పనిచేస్తున్న నాయకులను విమర్శించడం తగదు అని తెలిపారు. రాణి పేట నుండి వయా వెల్గొమ్ముల, కొత్తూరు మిడ్జిల్ వరకు డబల్ బీటీ రోడ్డు మంజూరు చేయించానని తెలిపారు. జడ్చర్ల నియోజకవర్గంలో ఇసుక అనుమతులు ఎక్కడ ఇప్పించలేదని ,ప్రతిపక్ష నాయకులు విమర్శలు చేయడం తగదని తెలిపారు. గత ప్రభుత్వంలోని అధికారులు జప్తి చేసిన ఇసుకను జిల్లా కలెక్టర్ పాలమూరు మెడికల్ కాలేజ్ కోసం అనుమతులు ఇచ్చారని తెలిపారు. జడ్చర్ల నియోజకవర్గం ప్రజలకు ఎప్పుడు అందుబాటులోనే ఉంటానని ఏ సమస్య ఉన్న అధికారుల దృష్టికి తీసుకొస్తే పరిష్కరించే విధంగా కృషి చేస్తానని తెలిపారు. ఎమ్మెల్యేగా గెలిచి మొదటిసారిగా ప్రభుత్వ అధికారక కార్యక్రమానికి వచ్చిన ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డికి ఎంపీపీ సుదర్శన్ ఎంపీడీవో శాలువా పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటిసి గౌస్ రబ్బాని, పిఎసిఎస్ వైస్ చైర్మన్ అల్వాల్ రెడ్డి, తాసిల్దార్ రాజు నాయక్, ఎంపీ ఓ అనురాధ, మిడ్జిల్ ఎంపీటీసీ సభ్యులు గౌస్, ఏపీజీవీబీ మేనేజర్ రాజశేఖర్ ,ఏపిఎం రాందాస్ నాయక్, ఎంపీటీసీ సభ్యులు నరసింహ, రాజారెడ్డి, మాజీ సర్పంచ్లు జంగయ్య, మున్ననూరు జంగయ్య, నాయకులు మల్లికార్జున్ రెడ్డి ,సాయిలు, అశోక్, జహీర్, ఉస్మాన్, కృష్ణ యాదవ్, మల్లికార్జున్, మండల శాఖ అధికారులు మహిళా సంఘ సభ్యులు సీసీలు ప్రకాష్ ,యాదమ్మ క్రాంతి, పాల్గొన్నారు.

## సొమ్ము ఒకరిది. సోకు మరొకరిది.

- జీసీసీ మాజీ చైర్మన్ వాల్యే నాయక్

నవతెలంగాణ- బాలానగర్



సొమ్ము ఒకరిది. సోకు మరొకరిది,లక్ష్మారెడ్డి ని చిన్నచూపు చూస్తే సహించేది లేదని మాజీ చైర్మన్ రామవత్ వాలి నాయక్ అన్నారు. సోమ వారం విలేకరుల సమా వేశంలో మాట్లాడుతూ మం జూరు చేసింది మేమైతే శంకు స్థాపన చేయటం మరొకరా అని ప్రశ్నించారు. సోమవారం బాలానగర్ మండల పరిధిలోని కేతిరెడ్డిపల్లి సూరారం గ్రామంలో చెక్ డ్యాములను అక్టోబర్ నెలలోనే మంజూరయ్యాయని ఆ పనులకు జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి శంకుస్థాపనలు చేయడం ఏమిటి అని ప్రశ్నించారు.బాలానగర్ మండలం జాతీయ రహదారి నుండి 10 గ్రామాలను కలుపుకొని జడ్చర్ల మండలం గంగాపూర్ వరకు డబల్ రోడ్డును జడ్చర్ల మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి జూలై 2023లో రూ. 56 కోట్లతో రోడ్డును మంజూరు చేస్తేప్రస్తుత ఎమ్మెల్యే మేమే మంజూరు చేశామని ప్రగల్భాలు పలుకుతుండడం సమంజసం కాదన్నారు.56 కోట్లతో మంజూరు చేసిన కాంట్రాక్టర్ రద్దుచేసి సివిటి కాంట్రాక్టులు ఎలా ఇస్తారని వారు ప్రశ్నించారు. ఇటీవల బాలానగర్ మండల కేంద్రంలో రోడ్డు ప్రమాదంలో ఐదుగురు చనిపోతే ఒక్కొక్క కుటుంబాన్ని 25 లక్షల రూపాయలు ఇచ్చి ఆదుకోవాలని అన్నారు. విలేకరుల సమావేశంలో మండల ప్రజా పరిషత్ ఉపాధ్యక్షుడు వెంకట చారి. మండల టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు పి శ్రీనివాసరావు, మాజీ పీఎసీఎస్ చైర్మన్ వెంకటరావు గౌడ్. మండల ప్రధాన కార్యదర్శి గుండేటి చెన్నారెడ్డి, గణేష్ గౌడ్,తిరుపతి నాయక్, బాలు నాయక్, గోపి నాయక్ పలువురు ఉన్నారు.

# ఉపాధిపై ఆశలు ?

- కోచింగ్‌ల కోసం పరుగులు
- పరిశ్రమల ఏర్పాటుకు పుష్కలమైన వనరులు
- పరిశ్రమల ఏర్పాటుపై నూతన ప్రభుత్వ నిర్ణయం
- ఉపాధి అవకాశాలు వస్తాయని ఎదురుచూపు
- కొత్తూరు నుంచి అలంపూర్ వరకు జాతీయ రహదారిసమీపంలోనే అంతర్జాతీయ విమానాశ్రయం





నవతెలంగాణ-మహబూబ్‌నగర్ ప్రాంతీయప్రతినిధి

ఉమ్మడి జిల్లాలో కొత్తూరు,బాలానగర్, జడ్చర్ల, అడ్డాకుల, కొత్తకోట, పెబ్బేరు, అలంపూర్‌లో 175, 450 చిన్న పరిశ్రమలున్నాయి. 56 వేలకు పైగా కార్మికులు పనిచేస్తున్నారు. గత పదేళ్ల కాలంలో 100కు పైగా పరిశ్రమలు మూత పడ్డాయి. పాలెం, జడ్చర్ల పరిధిలో పరిశ్రమల కారిడార్ కోసం భూమిని సేకరించారు. అయితా...పరిశ్రమలను ఏర్పాటు చేయలేదు. కొత్తగా వచ్చిన కాంగ్రెస్ పాలనలోనైనా పరిశ్రమలు పరిశ్రమలు ఏర్పాటు చేయాలని కార్మిక సంఘాల నాయకులు కోరుతున్నాయి.ఉపాధి అవకాశాల రూపకల్పనతో పాటు డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు అవకాశాలున్నాయి. ముఖ్యంగా కాగితం పరిశ్రమకు నాగర్‌కర్నూల్ జిల్లా పరిధిలో నల్లమల అటవీ ప్రాంతం ఉంది. విస్తారమైన కలప లభిస్తోంది. ఇంకా కొల్లాపూర్ ప్రాంతంలో నాపరాతి నిల్వలు పుష్కలంగా ఉన్నాయి. వీటి ద్వారా సిమెంటు పరిశ్రమలు ఏర్పాటు చేయవచ్చు. ముఖ్యంగా నల్లమలలో బీడీ, ఔషధ గుణాలు కల్గిన మొక్కలున్నాయి. వీటి ద్వారా బీడీ పరిశ్రమలు, ఆయుర్వేధ మందుల కంపెనీని ఏర్పాటు చేయవచ్చు ఇంకా నారాయపేట, గద్వాలలో పట్టు చేనేత కారులు అధికంగా ఉన్నారు. వీటికి అనుబంధమైన పరిశ్రమలు ఏర్పాటు చేస్తే... వేలాది మందికి ఉపాధి లభిస్తోంది. పత్తి ద్వార కాటన్, నూనే దాగుబడుల ద్వారా అయిల్ మిల్లులు ఏర్పాటు చేయవచ్చు. ప్రభుత్వం వెంటనే జిల్లాలో ఉన్న వనరులను ఉపయోగించుకొని ఉపాధి అవకాశాల కోసం పరిశ్రమలను ఏర్పాటు చేయాలని యువకులు కోరుతున్నారు.

### పరిశ్రమల ద్వారా ఉపాధి కల్పించాలి



మహబూబ్‌నగర్ జిల్లాలో పరిశ్రమల కోసం అనేక అవకాశా లున్నాయి. వీటిని ఉపయోగించుకొని పరిశ్రమలు ఏర్పాటు చేయవచ్చు. విమానాశ్రయంతో పాటు రైల్వే లైను ఉంది. నది సమీప ప్రాంతమైన జిల్లలో మానవ వనరులు పరిశ్రమలకు అవసరమైన ముడిసరుకు ఇక్కడ లభిస్తోంది. నూతనంగా ఏర్పాటు అయిన ప్రభుత్వం అయిన పరిశ్రమలపై దృష్టి పెట్టాలి.

ఎన్. కురుమూర్తి, సీఐటీయూ జిల్లా కార్యదర్శి, మహబూబ్‌నగర్

జిల్లాలో పరిశ్రమలే కాదు తెలంగాణ ప్రభుత్వం ఇచ్చే నోటిఫికేషన్లు,ఖాళీల భర్తీ ప్రక్రియ మొదలుకావడంతో నిరూద్యోగులలో ఆశాలు రేకిస్తున్నాయి. ఇటీవల నర్సింగ్, పోలీసు శాఖలో ఉన్న ఖాళీలను భర్తీ చేస్తుండటంతో యువత సంతోషం వ్యక్తం చేస్తున్నాయి.ఏర్పాటుకు వనరులు పుష్కలంగా ఉన్నాయి. ఒక వైపు పాలమూరకు సమీపంలో శంషాబాద్ దగ్గర అంతరజ్ఞాతీయ విమానాశ్రయం. మరోవైపు హైదరాబాద్ నుండి కర్నాటకకు రైల్వే లైన్ ఉన్నది. 190 కిలోమీటర్ల పొడవునా ఐదు జిల్లాలో కృష్ణ, తుంగబద్ర, బీమా నదులున్నాయి. ముఖ్యంగా కొత్తూరు నుంచి అలంపూర్ వరకు జాతీయ రహదారి ఉంది. ఇంకా మానవ వనరులు, ముడిసరుకు విస్తారంగా లభిస్తోంది. గత పాలకులు వీటిని ఉపయోగించి పారిశ్రామిక కారిడార్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. కానీ ఇప్పటి వరకూ చేయలేదు. ఒక పరిశ్రమనైనా ఏర్పాటు చేయకపోగా ఉన్న పరిశ్రమలను మూసివేసేలా పాలకులు నిర్ణయాలు చేశారు.తెలంగాణలో నూతనంగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం పారిశ్రామిక రంగంపై దృష్టి సారించాలని పలు పార్టీలు కార్మిక సంఘాలు కోరుతున్నాయి.

## ప్రజావాణి ఫిర్యాదులను సత్వరం పరిష్కరించాలి : కలెక్టర్



నవ తెలంగాణ- మహబూబ్ నగర్

ప్రజావాణి ఫిర్యాదులను సత్వరం పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ జి.రవినాయక్ అధికారులను ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆయన సమీకృత జిల్లా అధికారుల కార్యాలయ భవన సముదాయంలోని సమావేశమందిరంలో ప్రజల వద్ద నుండి ఫిర్యాదులను స్వీకరించారు. వివిధ మండలాల నుండి, ఎక్కువగా భూములకు సంబంధించి, వ్యక్తిగత సమస్యల పరిష్కారం కోసం, పెన్షన్,ఉపాధి, ఉద్యోగం, వివిధ సమస్యలను పరిష్కరించాలన్నారు. కొంత మంది కలెక్టరుతో నెరుగా విన్న వించుకున్నారు. ప్రజావాణి లో అందిన పిర్యాదులు సంబంధిత అధికారులకు ఎండార్స్ చేస్తూ పరిశీలించి చర్యలు త్వరగా తీసుకోవాల్సిందిగా ఆదేశాలు జారీ చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎప్పటి ఫిర్యాదులు అప్పుడే పరిష్కరించాలని జాప్యం చేయవద్దని, దానివల్ల ఫిర్యాదుదారులకు ఇబ్బంది కలుగుతుందని, ఇదే విషయాన్ని కింది స్థాయి అధికారులకు తెలియజేయాలని చెప్పారు. ఈ సమావేశం లో, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, రెవెన్యూ అదనపు కలెక్టర్ ఎస్. మోహన్ రావు, పి.నర్సింహులు ,సిఈవో రాఘవేంద్రరావు, డీఆర్‌డీ.ఓ వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## లక్ష్మారెడ్డి మరణం కుటుంబానికి తీరనిలోటు

- ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి



నవ తెలంగాణ - మిడ్జిల్

కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతం కోస పనిచేసే లక్ష్మారెడ్డి మరణం కుటుంబానికే కాకుండా కాంగ్రెస్ పార్టీకి తీరనిలోటు అని జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని బోయినపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్త ఎమ్మెల్యే అనుచరుడు ప్రశాంత్ రెడ్డి తండ్రి లక్ష్మారెడ్డి గత పది రోజుల క్రితం చనిపోవడంతో దశదినకర్మలో పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలసి నివాళులర్పించారు. నమ్మిన సిద్ధాంతం కోసం ఎన్ని కష్టాలు వచ్చినా కాంగ్రెస్ పార్టీ బలోపేతం ఎంతో కృషి చేశారని అనారోగ్యానికి గురై మృతి చెందడం చాలా బాధాకరమని తెలిపారు. కుటుంబ యజమాని మరణం కుటుంబానికి కాకుండా బంధువులకు, గ్రామస్తులకు మండల ప్రజలకు తీరని లోటు అని తెలిపారు. వయసులో ఎంత పెద్దవాడైనా చిన్న పెద్దన్ని తేడా లేకుండా అందర్నీ మర్యాదగా గౌరవిస్తూ పలకరించే వ్యక్తి లక్ష్మారెడ్డి అని కొనియాడారు. కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటానని కుటుంబ సభ్యులు ఎవరు కూడా అధైర్య పడవద్దని ప్రశాంత్ రెడ్డి కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే వెంబడి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు అల్వాల్ రెడ్డి, ఊరుకొండ మండల్ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు తిరుపతి రెడ్డి, ఊరుకొండ, మిడ్జిల్ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు గౌస్, మల్లికార్జున్ రెడ్డి, బాల్ రెడ్డి, వెంకటయ్య సాయిలు, గోపీనాయక్ వెంకటయ్య గౌడ్, వెంకటేష్ గౌడు బీర్లా మల్లయ్య, వివిధ గ్రామాలకు చెందిన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సేవా భావం తో పనిచేయండి : ఎమ్మెల్యే యెన్నం

నవతెలంగాణ- మహబూబ్ నగర్



సేవా భావం తో కలిసి పనిచేయాలని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. సోమవారం పేదల తిరుపతి మన్యం కొండ దేవాలయంలో జరిగిన నూతన పాలక మండలి సభ్యుల ప్రమాణస్వీకార కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ఆయన మాట్లాడుతూ పేదల తిరుపతి గా పేరు గాంచిన గొప్ప క్షేత్రం గా చరిత్ర కలిగిన ఈ శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి వారి సేవలో పాలక మండలి సభ్యులుగా మీ అందరికీ అవకాశం రావడం మీ అదృష్టం గా భావిస్తున్నానని తెలిపారు. ఇలాంటి గొప్ప అవకాశాలు ఏ కొందరికో దక్కుతాయని, అలాంటి అవకాశం మీకు లభించడం సంతోష దాయకమని ఆయన చెప్పారు. భగవంతునికి సేవ చేస్తూ, భక్తులకు సౌకర్యాలు కల్పిస్తూ, దేవాలయ అభివృద్ధికి ఏవిధంగా పనిచేయాలని ఆలోచనలు చేయాలని ఆయన సూచించారు. ఈరోజు నుంచి జరిగే స్వామి వారి బ్రహ్మోత్సవాలలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులూ లేకుండా భక్తులు స్వామి వారి దర్శనాన్ని సంతోషంగా చేసుకునే భాగ్యం కల్పించడంపై పాలకమండలి సభ్యులు దేవాలయ చైర్మన్ మరియు ఇఓ గారితో సమన్వయంతో పనిచేసి దేవాలయం పేరు ప్రఖ్యాతులు తేవాలని ఆయన సూచించారు. అంతకు ముందు శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి వారి దేవాలయ అర్చకులు రాజేష్ పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే శ్రీ యెన్నం శ్రీనివాస్ రెడ్డి గారు శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు ఎమ్మెల్యేకి స్వామి వారి శేష వస్త్రం, తీర్థ ప్రసాదాలు అందించి వేద ఆశీర్వాదం అందించారు. ఈ కార్యక్రమంలో మన్యం కొండ దేవాలయ చైర్మన్ అలహరి మధుసూదన్ శర్మ ఇఓ శ్రీనివాస్ రాజు, పాలక మండలి సభ్యులు, గోవింద్, ప్రభాకర్ రెడ్డిఅలివేల మంగమ్మ, శంకర్, కె.సుధ, వనజ, బాలరాజు, శ్రవన్ కుమార్, వెంకటాచారి, చంద్రశేఖర్, నాయకులు మల్లు నర్సింహారెడ్డి, ధర్మాపూర్ నర్సింహారెడ్డి, సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రపంచానికి ధీటుగా పాలమూరును తయారు చేద్దాం: ఎమ్మెల్యే



నవ తెలంగాణ- మహబూబ్ నగర్

పోటీ ప్రపంచంలో పాలమూరు విద్యార్థులను ప్రపంచానికి ధీటుగా తయారు చేద్దామని స్థానిక ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. సోమవారం పాలమూరు విశ్వవిద్యాలయం సందర్శించి మీడియాతో మాట్లాడారు..2012-2014 సమయంలో తెలం గాణ ఉద్యమం ఉవ్వెత్తున ఎగసి పడుతున్న సమయంలో నాటి ముఖ్యమంత్రి శ్రీ కిరణ్ కుమార్ రెడ్డిని, నాటి రాష్ట్ర మంత్రి డికె అరుణ గారిని కలిసి పాలమూరు విశ్వవిద్యాలయం ఆవశ్యకతను వివరించి కనీసం అవసరాలకు సంబంధించి హాస్టల్ , తరగతి గదుల నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయడంలో నాడు ఒక టీం వర్క్ గా ఎలాంటి భేషజాలకు పోకుండా మహబూబ్‌నగర్ విద్యార్థుల భవిష్యత్తుకు పార్టీలు అడ్డు కారాదని అందరినీ కలుపుకొని కొంత అభివృద్ధి జరిగిందన్నారు. రూసా నుంచి మంజూరైన 100 కోట్లు రూపాయలు పాలమూరు యూనివర్సిటీకి ఆక్సిజన్ లాంటిదని, వెనుక బడిన పాలమూరు జిల్లా కు పెద్దమొత్తంలో నిధులు మంజూరు కావడం మహబూబ్ నగర్ జిల్లా విద్యార్థులకు ఎంతో మేలు చేకూరుతుందని ఆయన చెప్పారు. అంతే కాదు రాష్ట్ర ప్రభుత్వం నుంచి మౌళిక సదుపాయాల కల్పన కోసం 20 కోట్లు రూపాయలు కూడా మంజూరు చేయడం జరిగింది అని ఆయన చెప్పారు.దీంతో పాలమూరు విశ్వ విద్యాల యానికి మంచి రోజులు రాబోతున్నాయి అని ఆయన చెప్పారు.తెలంగాణ రాష్ట్రం లో ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు అయ్యాక ప్రధానంగా విద్య పైన అధికంగా శ్రద్ధ పెడుతుందని ఆయన చెప్పారు. అందులో భాగంగా రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ ఎ రేవంత్ రెడ్డి గారి తో చర్చించి ఈ విశ్వవిద్యాలయానికి 50 నుంచి 100 కోట్లు నిధులు మంజూరు చేయించేందుకు కృషి చేస్తానని, పాలమూరు యూనివర్సిటీ లో పీజీలో రాబోయే రోజుల్లో అవసరమైన సైన్స్, కంప్యూటర్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానికల్ లాంటి ఎన్నో కొత్త ఫీచర్లతో పీజీ సబ్జెక్టు లను అందుబాటులోకి తెచ్చేందుకు కృషి చేస్తానని తెలిపారు.పాలమూరు యూనివర్సిటీ నుంచి మంచి స్కాలర్స్ తయారు కావాలని ఆయన సూచించారు.కార్యక్రమంలో పాలమూరు యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఎల్ బి లక్ష్మీకాంత్ రాథోడ్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పిండి పవన్ కుమార్, వివిధ శాఖల ప్రిన్సిపాల్స్ డాక్టర్ చంద్రకిరణ్, డాక్టర్ సుజాత, డాక్టర్ బషీర్ అహ్మద్, డాక్టర్ రాజ్ కుమార్ పాల్గొన్నారు.

## ఘనంగా చత్రపతి శివాజీ జయంతి



మహబూబ్ నగర్ : భారత దేశ కీర్తిని ప్రపంచ దేశాలకు చాటిన ధీరుడు చత్రపతి శివాజీ అని మాజీమంత్రి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. సోవ ంవారం మహబూబ్ నగర్ పుర పాలిక పరిధిలోని పాలకొండలో ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహా ఆవిష్కరణ చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. శివాజి, అంబెద్కర్, జ్యోతిభా పూలే, స్వామి వివేకా నంద, పండుగ సాయన్న వంటి వారు దేశం గురించి ప్రజల గురించి పోరాటం చేశారని తెలిపారు. కార్యక్రమం లో మాజీ మున్సిపల్ చైర్మన్ నర్సింహులు, మాజీ ఏఎంసీ వైస్ చైర్మన్ గిరిధర్ రెడ్డి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ గణేష్, కౌన్సిలర్ లు నరేందర్, కట్ట రవికిషన్ రెడ్డి, వేదావత్, శ్రీనివాసులు, కిశోర్ కుమార్, సీనియర్ నాయకులు కృష్ణమోహన్, శ్రీనివాస్ రెడ్డి, తిరుపతి రెడ్డి, సతీష్,పాల్గొన్నారు.

గండీడ్ :మండల పరిధిలోని పల్లె పల్లెనా ఛత్రపతి శివాజీ జయంతిని సోమవారం గ్రామ యువజన సంఘసభ్యులు,ప్రజా ప్రతినిధులు,యువకులు జడ్పీటీసీ సభ్యుడు మాచారం శ్రీనివాస్ రెడ్డి ఘనంగా నిర్వహించారు. అనంతరంకొండరెడ్డిపల్లి గ్రామంలో శివాజీ మహారాజ్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఆయాగ్రామాల్లో యువకులు బైక్ ర్యాలీ నిర్వహించారు.



హన్వాడ :మండల పరిధిలోని వేపూరులో చత్రపతి శివాజీ జయంతిని ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు ఏపీ మిథున్ కుమార్ రెడ్డి, మండల అధ్యక్షులు డాక్టర్ వెంకటయ్య ,లింగన్న రఘురాం, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు కిరణ్ కుమార్ రెడ్డి ,జిల్లా అధికార ప్రతినిధి రాచాల శ్రీనివాసులు, గుండాసంతోష్ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
నమస్తే తెలుగు దినపత్రిక
2
వనపర్తి
మంగళవారం | ఫిబ్రవరి 20, 2024 | www.navatelangana.com

## ఎమ్మెల్యేకు ఆహ్వానం



ఆత్మకూరు : అమర చింత మున్సిపల్ కార్యాలయంలో మంగళ వారం జరిగే బడ్జెట్ సమా వేశాలకు రావాలని మున్సిపల్ చైర్మన్ నాగభూషణం గౌడ్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ని సోమ వారం మక్తల్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం వద్ద ఆహ్వానించారు. ఎమ్మెల్యేగా ఎన్నికైన తర్వాత మొదటిసారి మున్సిపల్ సమా వేశాలకు రానున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నూరుల్ నజీబ్, మున్సిపల్ సిబ్బందితో పాటు తదితరులు పాల్గొన్నారు.

## ఎంపీడీవోకు సన్మానం



వీపనగండ్ల : వీపనగండ్ల ఎంపీడీవోగా పనిచేసిన కథలప్ప బదిలీలో భాగంగా నాగర్‌కర్నూలు జిల్లాకు వెళ్లడం జరిగింది. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ అధికారులు, ఎంపీటీసీలు, తాజా మాజీ సర్పంచు పూలమాల, శాలువాతో ఎంపీడీవో కథలప్పను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీపీ కమలేశ్వరరావు, తహసీల్దార్ వరలక్ష్మి, ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షులు ఇంద్రకంటి వెంకటేష్ మాట్లాడుతూ మండల అభివృద్ధికి, హరితహారంలో మొక్కల పెంపకం నిర్వహణ కోసం ఎంతో కృషి చేశారని అన్నారు. ఉద్యోగస్తులకు బదిలీలు సర్వసాధారణమని , పనిచేసే చోట చేసిన సేవలు గుర్తుండిపోతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ భాస్కర్ రెడ్డి , తాజా మాజీ సర్పంచులు మౌలాలీ, రఘునాథ్ రెడ్డి, రామేశ్వరరావు, అంజయ్య, పద్మ, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

# పది, ఇంటర్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

- కలెక్టర్ తేజస్ నంద లాల్ పవార్
- విద్యాశాఖ అధికారులతో కలెక్టర్



నవతెలంగాణ - వనపర్తి

మార్చి 18 నుంచి ప్రారంభం కానున్న పదో తరగతి పరీక్షలు, ఫిబ్రవరి, 28 నుంచి ప్రారంభం కానున్న ఇంటర్మీడియట్ పరీక్షలను వనపర్తి జిల్లాలో పకడ్బందీగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తేజస్ నంద లాల్ పవార్ అధికారులను ఆదేశించారు. సోమవారం ప్రజావాణి హాల్లో పదవ తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షలు నిర్వహణ పై జిల్లా స్థాయి సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఫిబ్రవరి, 28 నుంచి మార్చి 16వ తేదీ వరకు ఇంటర్మీడియట్ పరీక్షలు ఉంటాయని, మార్చి, 18వ తేది నుంచి పదవ తరగతి పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. జిల్లాలో పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు లైన్ డిపార్ట్మెంట్ లు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.పరీక్షా కేంద్రాల్లో అన్ని మౌలిక వసతులు సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. సరిపడా బెంచీలు, సిసి కెమెరాలు, తాగు నీరు, విద్యుత్, లైట్లు, మరుగుదొడ్లు శుభ్రంగా ఉంచటం, పరిసరాలు పరిశుభ్రంగా చేయించుకోవటం, ప్రథమ చికిత్స వంటి అన్ని మౌలిక వసతులు ఉండాలని ఆదేశించారు. ప్రశ్న పత్రాల కస్టడీ సెక్యూరిటీ రూమ్, ఉదయం నిబంధనల మేరకు ప్రశ్న పత్రాల తరలింపు, సీసీ కెమెరాల ముందు మాత్రమే ప్రశ్న పత్రాలు తెరవడం వంటి జాగ్రత్తలు ముందస్తుగా చేపట్టాలని సూచించారు. పరీక్షలు నిర్వహించే సమయంలో జిరాక్స్ సెంటర్లు మూసి ఉంచాలని, 144 సెక్షన్ అమలు చేయాలని సూచించారు. పరీక్షల సమయంలో విద్యార్థులకు ఇబ్బందులు కలుగకుండా సమయానికి ఆర్టీసీ బస్సు లు నడపాలని సూచించారు. పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని, ఎట్టిపరిస్థితుల్లో చిట్టీలు, మాల్ ప్రాక్టీస్ నడవటానికి వీలు లేదన్నారు. నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. మున్సిపాలిటీ, గ్రామ పంచాయితీ అధికారులు పరీక్ష కేంద్రాల వద్ద పారిశుధ్యంపై బాధ్యతలు తీసుకోవాలని ఆదేశించారు. ఫిబ్రవరి 28 నుంచి ప్రారంభం కానున్న ఇంటర్మీడియట్ పరీక్షకు వనపర్తి జిల్లాలో మొదటి సంవత్సరం 6576 మంది విద్యార్థులు, 5881 ద్వితీయ సంవత్సరం విద్యార్థులు వెరసి 12,457 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు 25 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగింది. ఇద్దరు సిట్టింగ్ స్క్వాడ్, ఒక ఫ్లయింగ్ స్క్వాడ్ ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మార్చి 18 నుండి ప్రారంభం కానున్న పదవ తరగతి పరీక్షలకు 6906 మంది రెగ్యులర్ విద్యా ర్థులు, 63 మంది ప్రైవేట్ విద్యార్థులు ఈ సారి పరీక్ష రాయనున్నట్లు తెలిపారు. పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు 35 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగింది. ముగ్గురు ఫ్లయింగ్ స్క్వాడ్ లను నియమించనున్నట్లు తెలిపారు. విద్యార్థులకు చెకింగ్ పకడ్బందీగా చేయటం, మాల్ ప్రాక్టీస్ జరుగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వేసవి కాలంలో పరీక్షలు జరుగుచున్నందున తాగునీరు, ప్రథమ చికిత్సలో సరిపడా

ఓ.ఆర్.ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచటం జరగాలని ఆదేశించారు. అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ సంచిత్ గంగ్వార్, అదనపు కలెక్టర్ రెవెన్యూ యం. నగేష్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# మార్చి 3న పల్స్ పోలియో



వనపర్తి : మార్చి 3న జరిగే పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కలెక్టర్ తేజస్ నంద లాల్ పవార్ ఆదేశించారు. సోమవారం ప్రజా వాణి హాల్లో పల్స్ పోలియో కార్యక్రమ నిర్వహణ పై జిల్లా స్థాయి సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 0-5 సంవత్సరాల వయస్సు గల ఏ ఒక్క పిల్లవాడు పల్స్ పోలియో చుక్కలు వేసుకోకుండా ఉండరాదని సూచించారు. 3వ తేదీన ఏదేని కారణం చేత పోలియో చుక్కలు వెడుకోకుంటే 4,5 తేదీలలో రెండు రోజులు ఇంటింటికీ తిరిగి మిగిలిపోయిన వారిని గుర్తించి పోలియో చుక్కలు వేయాలని ఆదేశించారు. పోలియో చుక్కలు వేసిన పిల్లల చేతి వేలి పై మార్కింగ్ సజావుగా చేయాలని అప్పుడే మిగిలిపోయిన వారిని సులువుగా గుర్తించవచ్చును అన్నారు. వైద్య ఆరోగ్య శాఖ తో పాటు సంక్షేమ శాఖ, విద్యా శాఖ, మున్సిపాలిటీ, పంచాయతీ రాజ్ శాఖలు సమన్వయం తో పనిచేసి వందశాతం వ్యాక్సినేషన్ జరిగే విధంగా చూడాలని ఆదేశించారు. గ్రామాల్లో పంచాయతీ సెక్రెటరీ లు పల్స్ పోలియో కార్యక్రమం పై టామ్ టామ్ చేయించాలని సూచించారు. జిల్లాలో 54030 మంది 0-5 సంవత్సరాల వయస్సు గల పిల్లలను గుర్తించటం జరిగిందని, వీరందరికీ సరిపడా పోలియో వ్యాక్సిన్ అందుబాటులో ఉన్నట్లు జిల్లా వైద్య ఆరోగ్య అధికారి జయ చంద్ర మోహన్ తెలిపారు. అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ సంచిత్ గంగ్వార్, అదనపు కలెక్టర్ రెవెన్యూ ఎం నగేష్, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక



ఆత్మకూరు : అమరచింత మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన జిల్లాస్థాయి సైన్స్ టాలెంట్ టెస్ట్ ఆన్లైన్ పరీక్షలో అమరచింత జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని అప్నా , మస్తీపురం గ్రామానికి చెందిన సి.లక్ష్మీ జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక కావడం జరిగింది . ఈ పోటీలు జిల్లా స్థాయిలో ఈ నెల 21న నిర్వహించనున్నారు. విద్యార్థినుల ఎంపిక కావడం పట్ల పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయ బృందం, ప్రధానోపాధ్యాయులు బలరాముడు, విద్యార్థులను అభినందించారు.

# ప్రజావాణి ఫిర్యాదులను పరిష్కరించాలి : కలెక్టర్



వనపర్తి : ప్రజావాణిలో తమ సమస్యలు పరిష్కారం అవుతాయని ఒక నమ్మకంతో ఫిర్యాదుదారులు వస్తారని, వారి నమ్మకాలను నిలబెట్టే విధంగా జిల్లా అధికారులు అందరూ విధిగా పాల్గొని తమ శాఖకు సంబంధించిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించేందుకు సిద్ధంగా ఉండాలని కలెక్టర్ సూచించారు. సోమవారం ఐ డీ ఓ సీ ప్రజావాణి హాల్లో జిల్లా కలెక్టర్ పౌరుల నుంచి వచ్చిన ప్రజావాణి అర్జీలను అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ సంచిత్ గాంగ్వార్ అదనపు కలెక్టర్ రెవెన్యూ ఎమ్ నగేష్ తో కలిసి స్వీకరించారు. వచ్చిన ప్రజావాణి అర్జీలను సంబంధిత జిల్లా అధికారులు తక్షణమే స్పందించి పరిష్కరించాలని ఆదేశించారు. నేడు మొత్తం 51 ప్రజావాణి అర్జీలు వచ్చినట్లు తెలిపారు. ప్రజావాణి హాజరు కాని జిల్లా అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేయాల్సిందిగా ఆదేశించారు. పదవ తరగతి విద్యార్థులకు ఫిబ్రవరి 22వ తేదీన స్థానిక సురవరం ప్రతాప రెడ్డి టౌన్ హాల్లో ప్రేరణ తరగతులు నిర్వహించనున్నట్లు తెలిపారు. 10వ తరగతి చదువుతున్న ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ శాఖల వసతి గృహాల విద్యార్థులు ప్రేరణ తరగతులకు హాజరయ్యే విధంగా చూడాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ సంచిత్ గంగ్వార్, అదనపు కలెక్టర్ రెవెన్యూ ఎమ్ నగేష్, ఆర్ డి ఓ పద్మావతి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## ఘనంగా మెట్లపూజ



నవ తెలంగాణ - ఆత్మకూరు

ఆత్మకూరు మండలంలోని రేచింతల గ్రామంలో శివస్వాములు మెట్ల పూజ కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఉదయం నుంచి భక్తిశ్రద్ధలతో మెట్ల పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రేచింతల గ్రామ చుట్టుపక్కల గ్రామాల శివ స్వాములు హాజరయ్యారు. పూజా కార్యక్రమం అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి శివ స్వాములు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఓటర్ జాబితాలో పేర్లు నమోదు చేసుకోవాలి

- కలెక్టర్ తేజస్ నంద లాల్ పవార్




వనపర్తి : ఏప్రిల్ 1, 2024 నాటికి 18 సంవత్సరాలు నిండిన ప్రతి యువత ఓటరు జాబితాలో తమ పేరు నమోదు చేసుకోవాలని కలెక్టర్ తేజస్ నంద లాల్ పవార్ సూచించారు. సోమవారం మధ్యాహ్నం రాష్ట్ర ఎన్నికల ప్రధాన ఎలక్టోరల్ అధికారి వికాస్ రాజ్ హైదరాబాద్ నుంచి జిల్లా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు తో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పలు సూచనలు చేశారు. పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేయాలని కలెక్టర్లను సూచించారు. పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు రూపొందించిన తుది జాబితా విడుదల తర్వాత ఆయా జిల్లాలలో భారీగా కొత్త ఓటర్ల నమోదు, తొలగింపు కొరకు దరఖాస్తులు రావటం పై వికాస్ రాజ్ ఆరా తీశారు. పార్లమెంట్ ఎన్నికలకు తప్పులు లేని ఓటరు జాబితా సిద్ధం చేసుకోవాలని, ఎన్నికల సిబ్బంది వివరాలు తీసుకొని ఎపిక్ నెంబరుతో సహా ఆన్లైన్ లో వివరాలు నమోదు చేయాలనీ తెలిపారు. పోస్టల్ ఓటుకు ఈ వివరాలు ఉపయోగపడతాయని తెలిపారు. ఆగ్జలరి పోలింగ్ స్టేషన్ ల అవసరం ఉంటే ప్రతిపాదనలు పంపించాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న కలెక్టర్ మాట్లాడుతూ తుది ఓటర్ జాబితా ప్రచురించి అన్ని పోలింగ్ స్టేషన్లు, రాజకీయ పార్టీలకు పంపించడం జరిగిందన్నారు. ఓటర్లు జాబితాను పరిశీలించుకొని తమ పేరు ఉందా లేదా ఏదైనా తప్పులు ఉన్నాయా పరిశీలించుకోవాలి అన్నారు. కొత్తగా ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకున్న వారికి ఎపిక్ కార్డుల ముద్రణకు పంపడం జరిగిందని పోస్ట్ ద్వారా వారి ఇంటికి చేరుతాయని తెలిపారు. ఒకవేళ ఎవరిదైనా ఎపిక్ కార్డు పోగొట్టుకొని ఉంటే వారు ఫారం 8 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. చనిపోయిన ఓటర్లు, లేదా డూప్లికేట్ ఓటర్లు ఉంటే సంబధిత బీ.ఎల్. ఒ లకు లేదా తహసీల్దార్లు ఫారం 7 ద్వారా దరఖాస్తు చేయాలని సూచించారు. వనపర్తి జిల్లాలో తుది ఓటరు జాబితా విడుదల చేసిన తర్వాత ఇప్పటి వరకు 4431 దరఖాస్తులు వచ్చాయని ఇందులో ఫారం 6,7,8 ఉన్నట్లు తెలియజేశారు. ప్రతి దరఖాస్తును ఎ.ఈ.ఆర్ ఒ స్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి అర్హత ఉన్న వాటికి జాబితాలో చేర్చడం, డూప్లికేట్, మరణించిన,పోలింగ్ స్టేషన్ మార్పులను పరిష్కరించడం జరుగు తుందన్నారు. ఇప్పటికే ఈ.వీ.ఎం మొదటిస్థాయి పరిశీలన పూర్తి చేసు కోవడం జరిగిందని ఎన్నికల నిర్వహణకు జిల్లా యంత్రాంగం సర్వం సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ సంచిత్ గంగ్వార్, అదనపు కలెక్టర్ రెవెన్యూ యం. నగేష్, ఆర్డీవో పద్మావతి, తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

## నిరుద్యోగులకు ఉచిత శిక్షణ

నవతెలంగాణ - ఆత్మకూరు

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా లోని నిరుద్యోగులకు ఉచిత శిక్షణ , ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు ప్రథం ఎడ్యుకేషన్ సొసైటీ వారు సోమవారం ఒక ప్రకటనలు పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వనపర్తి ,నాగర్ కర్నూల్, గద్వాల, నారాయణపేట, వనపర్తి, మహబూబ్‌నగర్ జిల్లా నిరుద్యోగులకు ఎలక్ట్రికల్, సోలార్, గ్రాఫిక్ డిజైన్ , ఆటోమేటివి, టూ వీలర్ , ఫోర్ వీలర్ల శిక్షణ ఇచ్చి ఉద్యోగం కల్పించబడునని, వీరికి విద్యార్హతలు పదవ తరగతి, ఇంటర్ ,డిప్లమా, ఐటీఐ ,డిగ్రీ పాస్ లేదా ఫెయిల్ అయిన అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు . నిరుద్యోగులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు ఆధార్ కార్డు జిరాక్స్ కాపీని తీసుకురావాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు ప్రతం ఎడ్యుకేషనల్ సొసైటీ వారి ఫోన్ నెంబర్లు సెల్ నెంబర్ 6303430789, 9346651131 సంప్రదించాలని కోరారు.

# ఘనంగా శివాజీ జయంతి



ఆత్మకూరు : ఆత్మకూరు పట్టణంలో సోమవారం గాంధీ చౌరస్తాలో ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని ఏర్పాటు చేసి పూలమాలతో అలంకరించి ,జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆత్మకూరు మున్సిపల్ చైర్మన్ గాయత్రి రవికుమార్, డాక్టర్ విజయకుమార్ ,రిటైర్డ్ టీచర్ లింగన్న ,కౌన్సిలర్ అశ్విని కుమార్ ,విష్ణువర్ధన్ రెడ్డి , జిందే శ్రీనివాసులు ,సురేష్, చిన్న నరసింహ ,డ్యాన్స్ బాలు, టాకీ ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

వీపనగండ్ల: చిన్నంబాయి మండల కేంద్రంలో ఛత్రపతి మహారాజ్ జయంతి వేడుకలను ఘనంగా ప్రజా ప్రతినిధులు వివిధ సంఘాల నాయకులు,విద్యార్థులు ఘనంగా జరుపుకున్నారు. ఛత్రపతి శివాజీ మహారాజ్ చిత్రపటానికి ఎంపీపీ సోమేశ్వరమ్మ, జెడ్పీటీసీ కేసిరెడ్డి వెంకటరమణమ్మ చిన్నారెడ్డి, కొప్పునూరు సింగిల్ విండో డైరెక్టర్ దేగ శేఖర్ యాదవ్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో లక్ష్మోజి, దినేష్ రెడ్డి, మోహన్, బండారి వెంక టేష్, ఆర్టీసీ ఆంజ నేయులు, శ్రీని వాస్, నర్సోజి, నాగోజి రాజకుమార్ ,పేరు మాల శ్రీనివాస్, విద్యార్థులు వివిధ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## పెండింగ్ ప్రాజెక్టుల ..
## సమస్యలు పరిష్కరించండి

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఎండీ జబ్బార్



నవ తెలంగాణ - వనపర్తి

జిల్లాలో ఉన్న పెండింగ్ ప్రాజెక్టులు, తదితర సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఎం.డీ జబ్బార్ కోరారు. సోమవారం సీపీఐ(ఎం) వనపర్తి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాల యంలోని ప్రజావాణి సందర్భంగా జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టులు, తదితర సమస్యలు పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్‌కు వినతి పత్రం ఇచ్చారు. అనంతరం సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఎండీ జబ్బార్ మాట్లాడుతూ శ్రీశైలం నిర్వాసితులకు 98, 69 జీవోల ద్వారా ఉద్యోగాలు, నష్ట పరిహారం ఇవ్వాలని అన్నారు. ప్రాజెక్టులో నిర్వాసితులైన వారికి 2013 భూ సేకరణ చట్ట ప్రకారం నష్టపరిహారం చెల్లించాలని కోరారు. ధరణి భూ సమస్యలు పరిష్కరించాలని, రెండు లక్షల రైతు రుణమాఫీ చేసి, కొత్త రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. విద్యుత్ సమస్యలు పరిష్కరించి, 24 గంటలు కరెంటు ఇవ్వాలన్నారు. గిరిజన, దళితులకు కార్పొరేషన్ ద్వారా లోన్లు ఇవ్వాలని, ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. మైనార్టీలకు మైనార్టీ కార్పొరేషన్ ఏర్పాటు చేసి, లోన్స్ ఇవ్వాలని, 12శాతం రిజర్వేషన్ కల్పించాలని కోరారు. అర్హులైన వారందరికీ ఇంటి స్థలాలు, ఇల్లు నిర్మించి ఇవ్వాలన్నారు. అభయ హస్తం ద్వారా మహిళలకు ఇవ్వాల్సిన బెనిఫిట్స్ ఇవ్వాలన్నారు. జిల్లాలో అనేక ప్రధాన రోడ్లు, అంతర్గత రోడ్డు దెబ్బతిన్నాయని, వెంటనే నిర్మాణం చేపట్టా లన్నారు. చిన్నంబాయి, వీపనగండ్ల మండలాల్లో వరి, ఉల్లి, మిర్చి పంటలు 12 వేల ఎకరాలు పూర్తిగా ఎండిపోయిన వాటికి నష్టపరిహారం చెల్లించా లన్నారు. జూరాల చివరి ఆయకట్టు రైతులకు నీరు అందించే విధంగా ప్రయత్నం చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు డి బాల్ రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

## యూత్‌కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడిగా వంశీ



నవ తెలంగాణ - ఆత్మకూరు

ఆత్మకూరు పట్టణంలో సోమవారం రోడ్లు భవనాలఅతిథి గృహం దగ్గర రాష్ట్ర యువజన సంఘం అధ్యక్షులు శివసేనారెడ్డి, ఎమ్మెల్యే వాకటి శ్రీహరి ఆదేశాల మేరకు ఆత్మకూరు మండల యువజన కమిటీ ఎన్నుకోవడం జరిగింది. ఆత్మకూరు పట్టణ అధ్యక్షులుగా వంశీ నియమితులైనారు .ఈ సందర్భంగా ఆయనను పలువురు నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ యువజన అధ్యక్షులు తులసి రాజు, మండల అధ్యక్షుడు పరమేష్, పట్టణ అధ్యక్షులు నల్లగొండ శ్రీనివాసులు, మాజీ అధ్యక్షులు రహమతుల్లా ,నాయకులు కుమ్మరి రాజు, గడ్డం శ్రీకాంత్,సాయి రఘు ,మొబైల్ కాజా, మధు,గణేష్, తదితరులు పాల్గొన్నారు.

## తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి

- ఆర్డబ్ల్యూఎస్ ఏఈ దేవన్న



వీపనగండ్ల : తాగునీటి సమస్య పరిష్కారం కోసం కృషి చేయడం జరుగుతుందని ఆర్డబ్ల్యూఎస్ ఏఈ దేవన్న అన్నారు. మండలంలోని కల్వరాల గ్రామంలో ఏ ఏ కాలనీలలో తాగునీటి సమస్య నెలకొన్నదని గ్రామస్తుల తో కలిసి ఆర్డబ్ల్యూఎస్ ఏఈ పరిశీలించారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే విధంగా కృషి చేయడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కురుమన్న, గ్రామస్తులు కల్వరాల నరసింహ తదితరులు పాల్గొన్నారు.

## 'కులగణన'పై ప్రభుత్వం నిర్ణయం చారిత్రాత్మకం

- టీ.టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ఎస్. రామన్ గౌడ్



నవతెలంగాణ - పెబ్బేరు

తెలంగాణ రాష్ట్రంలో సమగ్ర కులగణన చేపట్టాలన్న ప్రభుత్వ నిర్ణయంతో బీసీలకు న్యాయం జరుగుతుందని టీ.టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ఎస్. రామన్ గౌడ్ అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ అసెంబ్లీలో కులగణన బిల్లు ఆమోదింప చేయడం చారిత్రాత్మక నిర్ణయమని అన్నారు. స్వాతంత్రం వచ్చిన 76 సంవత్సరాలలో కులగ ణన చేయకపోవడంతో న్యాయ బద్ధంగా రావలసిన నిధులు. నియ మాకాలు. రిజర్వేషన్లు లలో బీసీలు అన్ని రంగాలలో నష్టపోయారని పేర్కొన్నారు. కులాల లెక్కింపుతోనైనా బీసీలకు చట్టబద్ధంగా న్యాయం జరుగుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. విధి విధానాలు రూపొందించి వెంటనే కులగణన చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు.బడుగు బలహీన వర్గాలు సామాజికంగా రాజకీయంగా ఉద్యోగ పరంగా ఎదగాలన్న ప్రభుత్వ ఆకాంక్ష పట్ల ఆనందం వ్యక్తం చేశారు. టిడిపి వ్యవస్థాపక అధ్యక్షులు మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు బీసీలకు రిజర్వేషన్లు కల్పించారని. చంద్రబాబు నాయుడు రిజర్వేషన్లు మరింత పెంచి ఆర్థికంగా రాజకీయంగా సామాజికంగా బలహీన వర్గాలను ఎదిగేందుకు ప్రోత్సహిం చారని తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం సకల జనుల సర్వే చేసి వివరాలు బయట పెట్టలేదని విమర్శించారు. తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత స్థానిక సంస్థల్లో బీసీ ల రిజర్వేషన్లను 33% నుండి 23 శాతానికి గత బీఆర్ఎస్ ప్రభుత్వం తగ్గించిందని కులగణనతో 42 శాతం కు ఈ ప్రభుత్వం పెంచే అవకాశం ఉందన్నారు . కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో పెట్టిన విధంగా అసెంబ్లీలో ప్రవేశపెట్టిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కు.మంత్రులకు శాసనసభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

3
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నాగర్‌కర్నూల్
మంగళవారం | ఫిబ్రవరి 20, 2024 | www.navatelangana.com

## అభివృద్ధి చేయడమే ప్రభుత్వ ధ్యేయం :ఎమ్మెల్యే



నవతెలంగాణ -వంగూరు

వంగూరు మండలంలోని వెలుమల్లపల్లి నూతన గ్రామ పంచాయతీ భవనానికి శంకుస్థాపన కళ్యాణ లక్ష్మి చెక్కులను ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ పంపిణీ చేశారు. సోమవారం రైతు వేదిక నందు 89 మందికి కళ్యాణ లక్ష్మి చెక్కులను అందజేశారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే కల్యాణ లక్ష్మి పథకం ఉండదని ఏలన చేసిన వారికి బుద్ధి చెప్పండన్నారు. అదేవిధంగా ఎన్నికలలో ఇచ్చిన హామీల కార్యక్రమంలో భాగంగా ఈ 15 రోజులలో రెండు గ్యారెంటీలు కూడా ప్రవేశపెడతామని ఆయన తెలిపారు. ఉచిత కరెంటు 500 కి సిలిండర్ ఇచ్చే కార్యక్రమాన్ని కి శ్రీకారం చుడతామని అన్నారు. కార్యకర్తలు కాంగ్రెస్ శ్రేణులు ఎవరు కూడా బెంగపడకుండా కష్టపడిన వారికి నేనున్నానని ఆయన భరోసా ఇచ్చారు. రానున్న ఎన్నికలలో ప్రతి ఒక్కరి కష్టపడి ఎంపీ సీట్లు కానీ లోకల్ ఎలక్షన్లలో కానీ మనమే ముందుండి గెలుపొందాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు పండిత్ రావు ఎంపిటిసి రమేష్ గౌడ్ పాండురంగారెడ్డి పరశురాములు శంకర్ యాదవ్ జనార్ధన్, అచ్చంపేట నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ క్యామ మల్లయ్య, యాదగిరిరావు ,మానస, సత్యం, జంగయ్య ,తాహసిల్దార్ కిరణ్మయి కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా స్థాయి ఆంగ్ల డ్రామా పోటీలు విజయవంతం



నవతెలంగాణ - తెలకపల్లి

మండల పరిధిలోని గౌరెడ్డి పల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం నిర్వహించిన ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా స్థాయి ఆంగ్ల డ్రామా పోటీలు విజయవంతమైనట్లు పాఠశాల ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయులు లక్ష్మీ నరసింహారెడ్డి తెలిపారు.ఈ పోటీలలో ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాకు చెందిన గద్వాల, వనపర్తి, నాగర్ కర్నూల్ లకు చెందిన విద్యార్థులు పాల్గొని తమ గ్రామాలను ప్రదర్శించగా అందులో అత్యుత్తమంగా ఎంపికై విజేతలుగా నిలిచిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చెన్నారం మరియు కేజీబీవీ వనపర్తి టీంలకు జిల్లా ఆంగ్ల ఉపాధ్యాయ ఫోరం అధ్యక్షులు కంచర్ల శివప్రసాద్ బహుమతులను అందజేసినట్లు తెలిపారు ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇన్చార్జి హెచ్ఎం లక్ష్మీ నరసింహ రెడ్డి, ఉపాధ్యాయులు మధుసూదన్ రెడ్డి ,రమాదేవి వరలక్ష్మి , రామకృష్ణ రవీందర్, కృష్ణయ్య,మరియు వివిధ జిల్లాల నుంచి వచ్చిన ఆంగ్ల భాష ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## కంటి సంరక్షణకు విటమిన్ ఏ

నవతెలంగాణ- బిజినేపల్లి



మానవ శరీరంలో కంటి అవయం అత్యంత ప్రాధాన్యమని, కంటి సంరక్షణకు విటమిన్ ఏ తోడ్పాటు అవుతుందని లట్టుపల్లి వైద్యాధికారి డాక్టర్ బి.ఆలోచన అన్నారు.జిల్లావైద్య ఆరోగ్యశాఖ ఆదేశాల మేరకు ఈనెల12నుండి నేటి వరకు 9నెలలు పూర్తి అయిన వారినుండి ఐదు సంవత్సరంలోపూ పిల్లలకు ప్రత్యేకంగా విటమిన్ ఏ ద్రావణాన్ని పంపిణీ చేస్తున్నామని అన్నారు. సోమవారం బిజినపల్లి మండల పరిధిలోని మంగనూరు గ్రామంలో4వ అంగన్వాడి కేంద్రంలో విటమిన్ ఏ ద్రావణం పంపిణీ కార్యక్రమాన్ని ఆరోగ్య పరివేక్షకులు కే.కిస్టమ్మ చిన్నారులకు విటమిన్ఏ పంపిణీ చేశారు.లట్టుపల్లి ఆరోగ్య కేంద్రం పరిధిలోని మంగనూరు, గంగారం,లట్టుపల్లి, ఎర్రకుంట తండాలకు సంబంధించి అన్ని పాఠశాలలో,ఇంటింటా అరులైన చిన్నారులను గుర్తించి, వారికి ఆరోగ్య సిబ్బంది ఆశా కార్యకర్తల ద్వారా విటమిన్ఏ ద్రావణం పంపిణీ చేశామని తెలిపారు.కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు టి.యాదగిరి, పి.పద్మ,జ్యోతి,అంగన్వాడి కార్యకర్త సుగుణమ్మ,మమత,ఆశా కార్యకర్తలు శారద,అనిత, బాలమణి,కృష్ణవేణి, నాగమ్మ,పద్మ చిన్నారులు పాల్గొన్నారు.

## బీసీ కులగణన తీర్మానం చరి త్రాత్మకం

నవ తెలంగాణ- కందనూలు

జిల్లా కేంద్రంలో సోమవారం రోజున బీసీ పొలిటికల్ జేఏసీ కన్వీనర్ దన్నోజు అరవింద్ చారి బీసీ కులగణన తీర్మాణంపై ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బీసీ పొలిటికల్ జేఏసీ నాగర్కనూలు జిల్లా కన్వీనర్ దన్నోజు అర వింద్ చారి మాట్లాతూ అసెంబ్లీలో బీసీ సమగ్ర కులగణన తీర్మానం ఏకగ్రీవంగా ఆమోదం పొందటంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, పొన్నం ప్రభాకర్లకు ధన్యవాదాలు తెలియజేశారు, కాంగ్రెస్ మ్యానిఫెస్టో లో పేర్కొన్న విధంగా కులగణనకు అసెంబ్లీ తీర్మానం చేసింది అన్నారు, దేశ వ్యాప్తంగా బీసీ కులగణన చేయాలంటే కేంద్రంలో కూడా కాంగ్రెస్ ప్రభుత్వం రావాలన్నారు.

## వేసవిలో మొక్కలను కాపాడుకుందాం..

నవ తెలంగాణ వెల్దండ

రానున్న వేసే కాలంలో తెలంగాణ హరితహారం లో నాటిన మొక్కలను బ్రతికించుకుందామని రాచూర్ ఎంపిటిసి గుత్తి వెంకటయ్య అన్నారు. సోమవారం వెల్దండ మండల పరిధిలోని తిమ్మినోనిపల్లి గ్రామంలో రాచూర్ ఎంపిటిసి గుత్తి వెంకటయ్య నిధులతో పల్లె ప్రకృతి వనంలో బోర్ డ్రిల్లింగ్ చేశారు. ఈ సందర్భం గా ఎంపిటిసి మాట్లడుతూ .. రూ. 2 లక్షలతో బోరు డ్రిల్లింగ్ చేయడంతోపాటు బోరు మోటార్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయితీ సెక్రటరీ నవనీత , నాయకులు తిర్పతిరెడ్డి , రామచందర్ , బాలకృష్ణ , సుబ్బయ్య , కృష్ణయ్య , శ్రీరాములు పాల్గొన్నారు.

## ప్రతి పశువుకు టీకాలు వేయించాలి

**తిమ్మాజిపేట :** ప్రతి పశువు టీకాలు వేయించాలని మండల పశు వైద్యాధికారి శివరాజ్ అన్నారు. సోమవారం మండలంలోని మరికల్ ఏదురపల్లి రాళ్లచెరువు తండాలో పశువైద్య సిబ్బంది ఆధ్వర్యంలో పశువైద్య శిబిరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అయా గ్రామాలలో 39 పశువులకు వ్యాధి నిరోధక టీకాలను వేశారు. తైలేరియా తైలేరియా వ్యాధి జెర్సీ ఆవులలో వస్తుంది. ఈ వ్యాధి పశువులకు సోకితే వాపు, రక్తపు, మూత్రం, పసిరికలు, రక్తహీనత, శ్వాసకోశ ఇబ్బందులు. తలెత్తుతాయని తెలిపారు. ప్రభుత్వం సంకర జాతి పశువుల వ్యాధి నివారణకు రూ. 900 విలువ గల ఒక డోస్ ని ఉచితంగా అందిస్తుందని ఈ అవకాశాన్ని పశువుల యజమానులు తప్పనిసరిగా ఉపయోగించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పశువైద్యాధికారి శ్రావణి సిబ్బంది ఉన్నారు.

## మీని ఎస్‌బీఐ బ్రాంచ్ ప్రారంభం..

**వెల్దండ :** వెల్దండ మండల పరిధిలోని చెదిరిపల్లి గ్రామంలో సోమవారం నూతనంగా మంజూరైన మినీ ఎస్ బీ ఐ కేంద్రాన్ని వెల్దండ ఎస్ బీ ఐ బ్యాంక్ మేనేజర్ బానవత్ రాములు, అత్యతి మేనేజర్ హరీష్ రెడ్డి లు ప్రారంభించారు. గ్రామీణ ప్రజలకు బ్యాంకింగ్ సేవలు అందుబాటులోకి తీసుకురావడం కోసమే గ్రామీణ ప్రాంతాలలో మినీ ఎస్బిఐ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఎస్‌పీ మహిపాల్ నాయక్, చెదురుపల్లి మాజీ సర్పంచి యాదమ్మ అంజయ్య, పోలే అశోక్,ఉబ్బల గట్టు మాజీ సర్పంచి బుజ్జిసాజ్య నాయక్, బాలు నాయక్, సాల్య నాయక్, శ్రీను నాయక్, వెంకటేష్, బిచ్చ, విమల్ కుమార్ ,తదితరులు పాల్గొన్నారు .

## గురుకుల పాఠశా ఆకస్మిక తనిఖీ

నవతెలంగాణ కొల్లాపూర్ రూరల్

కొల్లాపూర్ మండల పరిధిలోగల సాంఘిక సంక్షేమ గురుకుల (బాలికల) పాఠశాలను ఆర్‌సిఓ విద్యలత ఆకస్మిక తనిఖీ చేశారు. ఇందులో భాగంగా పాఠశాలకు సంబంధించి అన్ని విభాగాలలో వసతులను విద్యా నాణ్యత ప్రమాణాలను పరిశీలించారు. పదవ తరగతి, ఇంటర్ విద్యార్థులకు చదువు ఆవశ్యకత గురించి వివరించారు. విద్యార్థులు మానసిక ఒత్తిడికి లోనవ్వకుండా బాగా చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. అదేవిధంగా ఈ వార్షిక పరీక్షలకు విద్యాపరంగా విద్యార్థులను బలోపేతం చేసి ఉత్తమ ఫలితాలు ఈ పాఠశాల విద్యార్థులకు రావాలని ప్రిన్సిపల్ జ్యోత్స్న మరియు ఉపాధ్యాయులకు సూచించారు.



# పార్లమెంట్ ఎన్నికలకు సంసిద్ధంగా ఉండాలి

• రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్

నవతెలంగాణ- కందనూలు

రానున్న పార్లమెంట్ ఎన్నికలకు సంసిద్ధంగా ఉండాలి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ అన్నారు. సోమవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్, ఇతర ముఖ్య ఎన్నికల అధికారులతో కలిసి ఆయా ఎన్నికల ఏర్పాట్లపై జిల్లా ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా నాగర్ కర్నూల్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి ఉదయ్ కుమార్,, అదనపు కలెక్టర్లు కుమార్ దీపక్, కె సీతారామారావు, ఈఆర్వోలతో కలిసి సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ మాట్లాడుతూ త్వరలో పార్లమెంట్ ఎన్నికలకు నోటిఫికేషన్ వెలువడనున్న దృష్ట్యాఎన్నికల నిర్వహణకు పోలింగ్ సిబ్బంది వివరాలు అప్డేట్ చేయాలన్నారు. ఎన్నికల నిర్వహణకు నియమించే సిబ్బందికి శిక్షణా కార్యక్రమాలు,భద్రతా ఏర్పాట్లు,పోలింగ్ కేంద్రాలలో కనీస ప్రాథమిక సౌకర్యాలు, ఫోటో ఓటరు గుర్తింపు కార్డుల పంపిణీ,రవాణా సౌకర్యాలు,తదితరాలు పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేయాలన్నారు.ఓటర్ల తుది జాబితా వచ్చినప్పటికీ డబల్ ఓటర్లు మరణించిన వారి ఓటర్ల తొలగింపు అంశాలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు.ఓటర్ల జాబితా రూపకల్పన నూతన పోలింగ్ స్టేషన్లో ఏర్పాటు వంటి అంశాలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. 18 -19 సంవత్సరాల ఓటర్లు ఓటర్ల నమోదుపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. పోలింగ్ కేంద్రా ప్రాంతం నుండి రెండు కిలోమీటర్ల కంటే ఎక్కువ దూరం ఉన్న ఓటర్లకు సహాయ పోలింగ్ కేంద్రాల ఏర్పాట్లపై ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. జిల్లాల్లో స్వీప్ కార్యక్రమాలను విరివిగా నిర్వహించి నూతన యువ ఓటర్లను నమోదు ప్రక్రియను పెంచాలన్నారు. నాగర్ కర్నూలు జిల్లాలో ఎన్నికల నిర్వహణపై తీసుకున్న చర్యలను జిల్లా కలెక్టర్ పి ఉదయ్ కుమార్ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి వివరించారు. ఈవీఎంల మొదటి స్థాయి తనిఖీల ప్రక్రియ విజయవంతంగా పూర్తి చేయడం జరిగిందని, రానున్న పార్లమెంట్ ఎన్నికలకు సిబ్బంది శిక్షణ తదితర అంశాలపై దృష్టి సారించినట్లు కలెక్టర్ రాష్ట్ర ఎన్నికల అధికారికి వివరించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్లు కుమార్ దీపక్, కే సీతారామారావు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## హస్త కళాకారులను అన్ని విధాలుగా ప్రోత్సహిం. : కలెక్టర్

నవతెలంగాణ- కందనూలు

సంప్రదాయ చేతి వృత్తులవారిని, హస్త కళాకారులను అన్ని విధాలుగా ప్రోత్సహిస్తూ.. వారిని ఆర్థికంగా బలోపేతం చేయాలనే సంకల్పంతో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకంపై ప్రజల్లో అవగాహన పెంపొందించాలని నాగర్ కర్నూలు జిల్లా కలెక్టర్ పి. ఉదయ్ కుమార్ సూచించారు. సోమవారం నాగర్ కర్నూల్ పట్టణంలోని తిరుమల ఫంక్షన్ హాల్ లో పీ.ఎం విశ్వకర్మ పథకంపై ఎంఎస్ఎంఈ (మైక్రో, స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్), జిల్లా పరిశ్రమల కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో జిల్లా స్థాయి అవగాహన సదస్సు నిర్వహించారు. అవగాహన సదస్సుకు ముఖ్యఅతిథిగా జిల్లా కలెక్టర్ పి. ఉదయ్ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతానికి చెందిన అర్హులైన ప్రతిఒక్కరూ ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకునేలా విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ పథకం ఉద్దేశాలు, ప్రయోజనాలను కలెక్టర్ వివరిస్తూ.. అర్హులైన విశ్వకర్మలందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. లబ్ధిదారులు మీ సేవ కేంద్రాలు లేదా గ్రామపంచాయతీ కార్యాలయాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. రిజిస్ట్రేషన్ కోసం ఆధార్ కార్డు, మొబైల్ నెంబర్, బ్యాంకు వివరాలతో పాటు రేషన్ కార్డు వంటి పత్రాలను సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు. స్వయం ఉపాధి ఏర్పర్చుకోవాలనుకునేవారికి ఉపయుక్తం ఈ పథకం ఉంటుందని చెప్పారు. కమ్మరులు, స్వర్ణకారులు, వడ్రంగులు, శిల్పులు, స్వర్ణకారులు, చెప్పులు కుట్టేవారు, బుట్టలు, చాపలు, చీపుర్లు తయారు చేసేవారు, దర్జీలు, చేపల వలలు తయారు చేసేవారు, పూలదండలు తయారు చేసేవారు, చర్మకారులు, రజకులు, ఆయుధాలు తయారు చేసేవారు, చేతి వృత్తులు, హస్త కళాకారులు వంటి 18 కేటగిరీలలో పని చేస్తున్నవారు ఈ పథకం ద్వారా ప్రయోజనం పొందేందుకు దరఖాస్తు చేసుకోవచ్చని కలెక్టర్ సూచించారు. ఇతరులపై ఆధారపడకుండా సొంతంగా స్వయం ఉపాధి ఏర్పర్చుకోవాలనుకునే చేతి వృత్తిదారులు, హస్త కళాకారులకు ఈ పథకం ఎంతో ఉపయుక్తంగా నిలుస్తుందన్నారు.అదనపు




కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ...18 ఏళ్లు లేదా అంతకంటే ఎక్కువ వయస్సు ఉన్న వ్యక్తులు, అసంఘటిత రంగంలో కుటుంబ-కేంద్రీకృత సంప్రదాయ వ్యాపారాలలో నైపుణ్యం లేదా చేతివృత్తుల పనిలో నిమగ్నమై ఉన్నవారు, స్వయం ఉపాధి పొందిన వ్యక్తులుగా విశ్వకర్మ పథకం ద్వారా సహాయం పొందేందుకు అర్హులు అని జిల్లాలోని ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని అదనపు కలెక్టర్ సూచించారు.ఈ విశ్వకర్మ పథకం అవగాహన సదస్సులో అదనపు కలెక్టర్ కుమార్ దీపక్, ఎంఎస్ఎంఈ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాసరావు, జీఎం ఇండస్ట్రీస్ రవి కిరణ్, జిల్లా పంచాయతీ అధికారి కృష్ణ, జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి శ్రీధర్ జి, లీడ్ బ్యాంకు మేనేజర్ కౌశల్ కిషోర్ పాండే, కామన్ సర్వీస్ సెంటర్ మేనేజర్ శివ, అదనపు డిఆర్డిఏ లక్ష్మీనారాయణ, నాగర్ కర్నూల్ మున్సిపల్ కమిషనర్ నరేష్ బాబు, ఈడియం నరేష్, డిపిఎం అరుణ, మెప్మా మేనేజర్, సీఎస్‌సీ ఆపరేటర్లు, ఔత్సాహిక విశ్వకర్మలు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## గిరిజనుల ఆరాధ్య దైవం సేవాలాల్ మహారాజ్ : ఎమ్మెల్యే కసిరెడ్డి

నవతెలంగాణ -కల్వకుర్తి

గిరిజనుల అభ్యున్నతి కోసం ఎంతో కృషిచేసిన సంత్ సేవాలాల్ మహారాజ్ గిరిజనుల ఆరాధ్య దైవంగా మిగిలిపోయారని ఎమ్మెల్యే కసిరెడ్డి నారా యణరెడ్డి అన్నారు. గిరిజన సంఘం ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలోని దేవరకొండ రోడ్డులో ఉన్న గిరిజన భవనంలో సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. అంతకు ముందు పట్టణంలోని మహబూబ్ నగర్ చౌరస్తాలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులు అర్పించిన అనంతరం పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే పూజా కార్యక్ర



మంలో పాల్గొని సేవాలాల్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలను గిరిజన సంఘం నాయకులు ప్రతి ఏడాది ఎంతో ఘనంగా జరుపుకోవడం అభినందనీయమని అన్నారు. సేవాలాల్ ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఆయన కోరారు. ఇటీవల అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం గిరిజనుల అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తుందని చెప్పారు. ఈ సందర్భంగా సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు ఈ కార్యక్రమంలో జడ్పీ వైస్ ఛైర్మన్ ఠాగూర్ బాలాజీ సింగ్, మాజీ సర్పంచ్ ఆనంద్ కుమార్, గిరిజన సంఘం నాయకులు హనుమ నాయక్, నిరంజన్ నాయక్, రమేష్ నాయక్, దేవీలాల్ చౌహన్, వాల్యా నాయక్, రాము నాయక్, గుండె నాయక్, గిరిజన ఉద్యోగ సంఘం నాయకులతో పాటు గిరిజనులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## 'ప్రజావాణి' ఫిర్యాదులను త్వరగా పరిష్కరించండి : కలెక్టర్

నవ తెలంగాణ - కందనూలు

ప్రజావాణి ద్వారా వచ్చిన ఫిర్యాదులను వీలైనంత త్వరగా పరిష్కరించేందుకు సంబంధిత అధికా రులు చర్యలు చేపట్టాలని నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ పి ఉదయ్ కుమార్ అన్నారు. సోమ వారం కలెక్టర్ కార్యాలయ హాలులో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా పరిధిలోని వివిధ గ్రామాల నుండి వచ్చిన ప్రజల ద్వారా 28 ఫిర్యాదులు అందాయి. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఫిర్యాదులను పరిశీలించి,ఆయా శాఖల అధికా రులకు అందజేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ..... ప్రజలు తమ యొక్క సమస్యల పరిష్కారానికి మన మీద నమ్మకంతో ఎంతో దూరం



నుంచి వచ్చి ఫిర్యాదులు చేస్తారని వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా సమస్య పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని సూచించారు.నేడు వచ్చిన 28 ఫిర్యాదుల్లో 20 ఫిర్యాదులు భూ సమస్యలపై వచ్చినవే కాగా ,పౌర సరఫరాల శాఖ, ఆరోగ్య శాఖ, పంచాయత్ రాజ్ శాఖ, విద్యుత్ శాఖ, మునిసిపాలిటీ , వ్యవసాయ శాఖకు,గిరిజన శాఖ లకు ఒక్కొక్కటి చొప్పున ఫిర్యాదులు ప్రజల నుండి వచ్చాయి.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ కుమార్ దీపక్, రెవెన్యూ అదనపు కలెక్టర్ సీతారామారావు , జడ్పీసీఈఓ దేవ సహాయం ,డి ఆర్ డీ ఓ పీడి ఓబులేసు, కలెక్టరేట్ ఏవో చంద్ర శేఖర్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

**కందనూలు :** సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని పలు ప్రాంతాల నుండి 06 ఫిర్యాదు దారులు వచ్చారు. ఫిర్యాదు దారులతో జిల్లా ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ స్వయంగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకుని సంబంధిత పోలీసు అధికారులకు ఫిర్యాదుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఎస్పీ ఆదేశించారు.

## యూనివర్శిటీలు అభివృద్ధి గాలికి వదిలేసిన ప్రభుత్వాలు :ఎస్ఎఫ్ఐ

నవతెలంగాణ - కొల్లాపూర్ రూరల్

యూనివర్సిటీలు అభివృద్ధి గాలికి వదిలేసిన ప్రభుత్వాలని నాగర్ కర్నూలు జిల్లా ఎస్ఎఫ్ఐ ప్రధాన కార్యదర్శి ఎం తారా సింగ్ అన్నారు. కొల్లాపూర్ డివిజన్ ఎస్ఎఫ్ఐ ముఖ్య కార్యకర్తల సమావేశం పట్టణంలోని గాయత్రీ జూనియర్ కళాశాలలో నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం కూడా విద్యారంగానికి తీవ్ర అన్యాయం చేసిందన్నారు. అసెంబ్లీ సమావేశాల్లో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఓటాన్ బడ్జెట్లో విద్యారంగానికి కేవలం 7.8శాతం మాత్రమే కేటాయించిందన్నారు. అంటే విద్యారంగానికి 21,389 కోట్ల రూపాయలు కేటాయించిందన్నారు. గత బడ్జెట్ తో పోల్చినప్పుడు కేవలం 2,296 కోట్లు విద్యా రంగానికి పెరిగినట్లు ఉన్నా మొత్తం బడ్జెట్ పోల్చినప్పుడు పెరిగింది ఇది చాలా తక్కువ గత విద్యా రంగ బడ్జెట్ తో పోల్చినప్పుడు కేవలం 1.31 శాతం మాత్రమే పెంచారు. ఈ నిధులతో ప్రస్తుతం ప్రభు త్వ విద్య యే మాత్రం అభివృద్ధి కాదని ఎస్ ఎఫ్ఐ భావిస్తోందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం తమ మేని ఫెస్టోలో పెట్టినట్లు ప్రతి మండలంలో తెలంగాణ మోడల్ ఇంటర్నేషనల్ పాఠ శాలలు




ఏర్పాటు చేస్తామని చెప్పిన కేటాయించిందన్నారు. 500 కోట్ల రూపాయలు మాత్రమే, 500 కోట్లతో ఎలా వీటిని నిర్వహిస్తారని ప్రశ్నించారు రాష్ట్రంలో బీఆర్ఎస్ పాలనలో యూనివర్సిటీలు దెబ్బతిన్నాయి. ఉస్మానియా కు 1000కోట్లు ,మహిళ యూనివర్సిటీ అభివృద్ధి కోసం నిధులు నిర్వహణ, బాసర ఐఐటి అభివృద్ధి, అలాగే ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లా కేంద్రాలలో నూతన యూనివర్శిటీలు కోసం కాంగ్రెస్ హామీ ఇచ్చింది. కానీ యూనివర్శిటీలు అభివృద్ధి కోసం 500కోట్లు మాత్రమే కేటాయించారని రాష్ట్రంలో ఉన్న 11 రాష్ట్ర యూని వర్శిటీలకు కనీసం నిర్వహణకు కూడా నిధులురావు. ఒక్క ఉస్మానియా యూనిర్శిటీకే 350 కోట్లు పైగా నిర్వహణకు అవసరం.లైబ్రరీ, ముత్ర శాలలు ,మౌళిక సదుపాయాలు కోసం ఈ నిధులు సరిపోవని ఎస్ఎఫ్ఐ భావిస్తోంది. గురుకులాలు నిర్మాణం కోసం 1546కోట్లు కూడా సరిపోవని 800 పైగా గురుకూలాలకు స్వంత భవనాలు లేవన్నారు. ఈబడ్జెట్లో గత ఆరేళ్ళ నుండి పెండింగ్ ఉన్న స్కాలర్ షిప్స్, ఫీజు రీయంబర్స్ మెంట్స్ 7200 కోట్లు పెండింగ్ లో ఉన్నాయి. వాటికి విడుదల కోసం నిధులు కేటాయించలేదు.నిధులను పెంచి ప్రభుత్వ విద్యారంగాని అభివృద్ధి చేయాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్ చేస్తోంది. లేకపోతే విద్యార్థులను కలుపుకుని రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేస్తామని ఎస్ఎఫ్ఐ తెలిపింది. ఈ మహాసభల కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు తరుణ్ రామకృష్ణ జస్వంత్ భాను శివ కరుణాకర్ మల్లేష్ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు

## ఘనంగాశివాజీ జయంతి

**తెలకపల్లి :** మండల కేంద్రంలోని సిద్ధార్థ మోడల్ స్కూల్ లో సోమవారం చత్రపతి శివాజీ జయంతి వేడుకలను విద్యార్థులు ఉపాధ్యాయులు ఘన ంగా నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపల్ శివ ప్రసాద్, పాఠశాల ఉపాధ్యాయులు రమేష్ గౌడ్, రామస్వామి ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**పెంట్లవెల్లి :** మండల కేంద్రంలో విశ్వహిందూ పరిషత్ బజరంగ్ దళ్ ఆధ్వర్యంలో శివాజీ మహారాజ్ జన్మదిన వేడుకలు ఘనంగా




నిర్వహించారు. కార్యక్రమంలో పెంట్లవెల్లి మండల నాయకులు యువకులు తదితరులు పాల్గొన్నారు.

**ఊరుకొండ :** చత్రపతి శివాజీ మహారాజ్ మహావీరుడు, ధీరుడు, శూరుడు, యుద్ధతంత్ర నిపుణుడు.. అన్నింటికీ మించి స్వాభిమానం కల దేశభక్తుడు ఛత్రపతి శివాజీ మహారాజ్ అని మాజీ సర్పంచ్ దండేత్కర్ అనితనాగోజి అన్నారు. సోమవారం ఊరుకొండ మండల పరిధిలోని ఉరుకొండ పేట గ్రామంలో శివాజీ చౌక్ వద్ద గల శివాజీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.కార్యక్రమంలో ఊరుకొండ పేట మాజీ సర్పంచ్ అనితనాగోజి ,శివాజీ యూత్ అధ్యక్షుడు రామాంజనేయులు, కార్యనివాహక అధ్యక్షులు రేపని శ్రీను, అమరచింతల శ్రీనివాస్, మ్యాకాల శ్రీనివాస్ మాజీ వార్డు సభ్యులు సిద్దు,అజ్జు, తదితరులు పాల్గొన్నారు.

## అచ్చంపేట డిఎస్పీగా పి శ్రీనివాస్

నవతెలంగాణ అచ్చంపేట



సబ్ డివిజన్ అచ్చంపేట పోలీస్ డిఎస్పీగా పి శ్రీనివాస్ సోమవారం సాయంత్రం బాధితులు స్వీకరించారు. సర్కిల్ సిఐ రవీందర్ స్వాగతం పలికారు.

## ఆపదలో ఆపద్బాంధవుడు అనిల్ రెడ్డి..

• కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు సంతోష్ రెడ్డి.

నవతెలంగాణ - ఊరుకొండ



ఆపదలో ఉన్న బడుగు బలహీన వర్గాల పేద ప్రజలందరికీ ఆపద్బాంధవుడు జకినాలపల్లి మాజీ సర్పంచ్ తలసాని అనిల్ రెడ్డి అని కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు సంతోష్ రెడ్డి, టౌన్ ప్రెసిడెంట్ ఆరిఫ్ లు అన్నారు. సోమవారం ఊరుకొండ మండల కేంద్రానికి చెందిన గడ్డం కృష్ణయ్య దశ దినకర్మ కార్యక్రమంలో భాగంగా గ్రామ ప్రజలకు స్వచ్ఛందంగా తలసాని అనిల్ రెడ్డి అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ.. ఊరుకొండ మండలంలో ఎవరికి ఏ ఆపద వచ్చిన తలసాని అనిల్ రెడ్డి అండగా నిలబడుతున్నారని వారన్నారు. భవిష్యత్తులో అనిల్ రెడ్డి మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని వారు ఆకాంక్షించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గణేష్, దయాకర్, ప్రసన్నకుమార్, ప్రసాద్, అంజయ్య, బాలయ్య ఇస్తారయ్య లక్ష్మయ్య, కాంగ్రెస్ యువ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, బిజెపి దళిత మోర్చా అధ్యక్షులు గడ్డం మహేందర్, గ్రామ పెద్దలు, గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

## పీఎం కిసాన్ ఈ కేవైసీ చేయించుకోవాలి

నవతెలంగాణ - వంగూరు

పీఎం కిసాన్ డబ్బులు పడాలంటే ప్రతి ఒక్కరు ఈ కేవైసీ చేయించుకొని ఉండాలని వ్యవసాయ అధికారిని తనుజ రాజ్ పేర్కొన్నారు. సోమవారం విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఈ కేవైసీ చేయించుకొని రైతులు వెంటనే సంబంధిత అధికారులను కలిసి పీఎం కిసాన్ ఈ కేవైసీ చేయించుకోవాలని సూచించారు. ఆధార్ కార్డ్ బ్యాంక్ అకౌంట్ బుక్ పట్టా పాస్ బుక్ తో ఏఈఓ లను సంప్రదించగలరు.

**కందనూలు:** నాగర్ కర్నూలు జిల్లాలో ఉన్న తెల్ల రేషన్ కార్డు ఆహార భద్రత కార్డుల రైతులు కేవైసీ (ఎలక్ట్రానిక్ నో యువర్ కస్టమర్) చేయించుకునేందుకు ఈ నెల 29వ తేదీ వరకు ఉన్న గడువును సద్వినియోగం చేసుకొని, సంబంధిత రేషన్ డీలర్ల వద్ద ఈకేవైసీ ప్రక్రియను పూర్తి చేసుకోవాలని నాగర్ కర్నూల్ జిల్లా పౌరసరఫరాల అధికారి స్వామి కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నాగర్ కర్నూల్ జిల్లాలో 2,37,822 తెల్ల రేషన్ కార్డులకు గాను,7,50,269 మంది కుటుంబ సభ్యులు ఉండగా ఇప్పటివరకు 4,88,047 మంది ఈకేవైసీ ప్రక్రియను పూర్తి చేసుకోగా ఇంకా 2,62,222 మంది ఈ కేవైసీ చేయించుకోవాల్సి ఉందని వారందరూ తప్పనిసరిగా ఈనెల 29వ తేదీ లోగా 100% ఈ కేవైసీ ప్రక్రియను పూర్తి చేసుకోవాలని ఆయన ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు

నవతెలంగాణ- కందనూలు

నాగర్ కర్నూలు జిల్లా కొల్లాపూర్ చౌరస్తా సమీపంలోని సరస్వతి దేవాలయం దగ్గర సోమవారం రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది ఈ ప్రమాదంలో కారు అతివేకంగా రెండు బైకుల పైకి వెనక నుంచి దూసుకుపోవడంతో బైక్ పై వెళుతున్న విజేందర్ రెడ్డి మంజుల తలకు చేతులకు బలమైన గాయాలు కావడంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాదు తరలించారు మరో బైకు శ్రీశైల దైవదర్శనానికి నారాయణపేట జిల్లా ఉట్కూరు మండలానికి చెందిన రవి జనార్దన్ ను నాగర్కర్నూల్ జర్నల్ ఆస్పత్రిలో చికిత్స అందించారు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## అనుమానస్పదంతో వ్యక్తి మృతి

**పెంట్లవెల్లి :** మండలం గోపులాపురం గ్రామానికి చెందిన వడ్డే కురుమయ్య (48) భార్య పర్వతమ్మ వీపనగండ్ల మండలం సంగినేని పల్లి గ్రామానికి చెందిన వీరు గత సంవత్సరం నారా కిందట గోపులాపురం గ్రామానికి బ్రతుకుతెరువు కొరకు వచ్చారు.సోమవారం భార్య భర్తల మధ్య గొడవ జరిగింది.భర్త ఇంట్లో మరణించి ఉండడంతో చుట్టుపక్కల ఉన్నటువంటి వారు బంధువులకు సమాచారం ఇవ్వగా బంధువులు పెంట్లవెల్లి మండల పరిధిలోని పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. సంఘటన స్థలానికి చేరుకున్న ఎస్ఐ రామన్ గౌడు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిందితులు ఎవరైనా సరే విడిచిపెట్టమని వారిపై కఠనమైనటువంటి చర్యలను తీసుకుంటామని ఆయన అన్నారు. మిగతా విషయాలు పోస్టుమార్టం తర్వాత వెల్లడిస్తామని ఆయన అన్నారు.

## విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

- ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి



**ఊట్కూర్ :** విద్యార్థులు మంచిగా చదివి ఉన్నత స్థానాలకు ఎదగాలని మక్తల్ నియోజకవర్గ శాసన సభ్యులు వాకిటి శ్రీహరి సూచించారు. సోమవారం సీడ బ్ల్యూసీ నెంబర్ చల్ల వంశీధర్ రెడ్డి విద్యార్థులకు తన వం తు సహా యం చేయాలని ఉద్దేశంతో మక్తల్ పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు మక్తల్ ఎమ్మెల్యే ఆధ్వర్యంలో విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్‌లను ఎమ్మెల్యే చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు మంచిగా చదివి ఉన్నత స్థానాలకు ఎదిగి తల్లిదండ్రులు, గ్రామానికి పేరు తీసుకు రావాలని ఆకా ంక్షిం చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు రవి, ఎంఎస్‌యూఐ నాయకులు అఫ్రోజ్ , కాంగ్రెస్ నాయకులు ఫయాజ్ గోవర్ధన్ , హాష ము ద్దీన్ , నరసింహా , గుంతలి రవి , సీనియర్ కాంగ్రెస్ నాయకులు , ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులను పరిష్కరించాలి

- అదనపు కలెక్టర్ అపూర్వ చౌహాన్



**జోగులాంబ గద్వాల :** ప్రజావాణికి వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించరించాలని జిల్లా అదనపు కలెక్టర్ అపూర్వ చౌహాన్ అన్నారు. సోమవారం ఐ.డీ.ఓ.సీ సమావేశం హాల్‌లో ఏర్పాటు చేసిన ప్రజావాణి కార్యక్ర మంలో వివిధ సమస్యలపై వచ్చిన ప్రజా ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వివిధ ప్రాంతల నుంచి ఆసరా పిం ఛన్లు 3 , ఉపాధి కల్పన 8, భూ సమస్యలపై తదితర సమస్యలకు సంబంధించి 29, మొత్తం 40 దరఖా స్తులు వచ్చినట్లు తంతంతంతంతంతంతతెలిపారు. ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు చేసుకున్న దరఖాస్తులను సాధ్యమైనంత త్వరగా పరిశీలించి తమ పరిధిలో ఉంటే వెంటనే పరిష్కరించాలని, లేనిపక్షంలో వారికి తగిన సూచనలు ఇవ్వాల్సిందిగా అధికారులకు సూచించారు. ప్రజా ఫిర్యాదులను జిల్లా అధికారులు సంబంధిత మండలాల తహసీల్దార్లు పెండింగ్ ఉంచకుండా త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

## ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపించండి

- మంత్రి జూపల్లి కృష్ణారావు



**ఉండవల్లి :** వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్రంలోనూ 17 పార్లమెంటు స్థానాల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. సోమవారం అలంపూర్ చౌరస్తాలోని కేజీఆర్ ఫంక్షన్ హాల్ పార్లమెంటు కార్యకర్తల సన్నాహక సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.ఈ కార్యక్రమం మాజీ ఎమ్మెల్యే ఏఐసీసీ అధ్యక్షులు సంపత్ కుమార్ ఆధ్వర్యంలో కొనసాగింది. ముందుగా అల్లంపూర్‌లోని జోగులాంబ బాల బ్రహ్మేశ్వర ఆలయం సందర్శించి పూజా కార్యక్రమంలో పాల్గొని కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పది సంవత్సరాలు పాలన చేసిన బీఆర్ఎస్ పార్టీ వ్యతిరేక తతో ప్రజలు కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టారని, ఎన్నికల ముందు ఇచ్చిన 6 గ్యారంటీలను త్వరలో పూర్తి చేస్తామన్నారు. భవిష్యత్‌లో బీజేపీ, టీఆర్ఎస్ రెండు పార్లమెంటు ఎన్నికల్లో కలిసి పనిచేసేందుకు సిద్ధమయ్యే పరిస్థితులు ఉన్నట్లు తెలిపారు. దేశం కోసం నెహ్రూ, ఇందిరా గాంధీ , రాజీవ్ గాంధీ వంటివారు ప్రాణాలర్పించారని గుర్తుచేశారు. రాహుల్ గాంధీ జోదయాత్ర పేరుతో కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు పాదయాత్ర చేసి ప్రజల సమస్యలను తెలుసుకుంటున్నట్లు పేర్కొన్నారు. దేశభద్రత, అభివృద్ధి కోసం పాటుపడుతున్న కుటుంబం కోసం మరోసారి కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని కోరారు. ప్రాజెక్టుల పేరుతో దోపిడీ చేశారని బీఆర్ఎస్ నిధులు, నీళ్ల , నియామకాలు , ఆత్మగౌరవం ఏమి జరగలేదని, ఆ కుటుంబంలో ఉన్న వారందరికీ పదవులు దక్కాయని విమర్శించారు. అసెంబ్లీలో ప్రాజెక్టులపై జరిగిన అవినీతిని సుదీర్ఘంగా స్పష్టమైన ఆధారాలతో బయటపెట్టిన చర్చ జరిగిందని, ప్రభుత్వం దానిపై పూర్తి సీబీఐ విచారణ చేపడుతున్నట్లు పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ఇందిరమ్మ ఇండ్లు , పింఛన్లు , రేషన్ కార్డులు ఉద్యోగాల నియామకాలు, అభివృద్ధి సంక్షేమం బాటలో నడుస్తాయన్నారు. ఆ నియోజకవర్గాల్లోనే ఇన్చార్జీలు, ఓడిపోయిన ఎమ్మెల్యేలకు బాధ్యతలు అప్పగిస్తూ అభివృద్ధికిబాటలు వేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వనపర్తి నాగర్ కర్నూల్ ఎమ్మెల్యేలు మేఘారెడ్డి , రాజేశ్వరి, ఢిల్లీ అధికార ప్రతినిధి మల్లు రవి , జెడ్పీ చైర్ పర్సన్ సరిత , మాజీ ఎమ్మెల్సీ దామోదర్ రెడ్డి , మాజీ ఎంపీ మంద జగన్నాథం, ఎంపీపీలు , జెడ్పీటీసీలు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## సివిల్ ఫిర్యాదులను ..
## కోర్టు ద్వారా పరిష్కరించుకోవాలి : ఎస్పీ



**నారాయణపేటటౌన్ :** ప్రజావాణి కార్యక్రమాన్ని పురస్కరించుకుని సోమవారం నారాయణపేట జిల్లాలోని వివిధ గ్రామాల నుంచి సమస్యలపై వచ్చిన ఫిర్యాదులను ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ యోగేష్ గౌతమ్ బాధితుల నుంచి 8 ఫిర్యాదులను స్వీకరించారు. వచ్చిన ఫిర్యాదులను చట్టప్రకారం పరిశీలించవలసిందిగా సంబంధిత పోలీస్ స్టేషన్ సీఐ,ఎస్ఐలకు ఫోన్ ద్వారా సూచించారు. భూములకు సంబంధించి ఎలాంటి సమస్యలు ఉన్న కోర్టు ద్వారానే పరిష్కరిం చుకోవాలని, ఫిర్యాదుదారులకు ఎస్పీ సూచించారు. బాధితులు తీసుకొవచ్చే ఎలాంటి ఫిర్యాదులు పెండింగ్లో ఉంచరాదని , వాటిని వెంటనే పరిష్క రించాలని ఫోన్లో మాట్లాడి సంబందిత అధికారులకు సూచించారు. శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా ప్రజా సమస్యల పరిష్కారానికి పోలీస్ శాఖ నిరంతరం పని చేస్తుందని, పోలీసులు ప్రజల మన్ననలు పొందే విధంగా విధులు నిర్వర్తించి వారికి సరైన న్యాయం అందించి భరోసా, భద్రత కల్పించాలని సూచించారు.ప్రస్తుతం అధునాతన టెక్నాలజీ పెరుగు తున్నందున సైబర్ నేరాలు కూడా పెరుగుతున్నాయి. ప్రజలు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, అత్యవసర సమయంలో డయల్ 100 లేదా1930కి కాల్ చేసి పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

## అపరిచిత వ్యక్తుల పట్ల..
## అప్రమత్తంగా ఉండాలి: ఏఎస్ఐ




**నారాయణపేటటౌన్ :** అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఏఎస్ఐ శ్రీదేవి అన్నారు. ఎస్పీ శ్రీ యోగేష్ గౌతమ్ ఆదేశాల మేరకు నారాయణపేట జిల్లా కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో సోమవారం షీ టీం ఆధ్వర్యంలో విద్యార్థినులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్ఐ మాట్లాడుతూ విద్యార్థులు పాఠశాలలకు వచ్చిపోయే సమయాలలో అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎవరైన వేధింపులకు గురి చేస్తే వెంటనే తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు లేదా పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. జిల్లాలో మహిళలు హక్కులు, రక్షణకు షీ టీం ప్రత్యేకంగా పనిచేస్తుందన్నారు. విద్యార్థినులను వేధింపులకు గురిచేసిన, ర్యాగింగ్ చేసిన కఠిన చర్యలు ఉంటాయని, స్కూల్లో, కళాశాలలో, బస్టాప్ ఇతర నిర్మాణ ప్రాంతాలు ఎవరైనా అమ్మాయిలను వేధిస్తే షీ టీం పోలీస్ హెల్ప్ లైన్ నెంబర్ 8712670398 కు లేదా డయాల్100కు కాల్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో షీ టీమ్ పోలీసులు బల్ రాజ్, ఉపాధ్యాయులు, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

## జములమ్మ, ఎల్లమ్మ జాతరకు ఏర్పాట్లు



**ఊట్కూర్ :** మండల కేంద్రమైన ఊట్కూర్‌లో మంగళవారం నిర్వహించనున్న జమ్మలమ్మ , ఎల్లమ్మ జాతర ఏర్పాట్లు పనులు జరుగు తున్నాయి. భక్తులకు ఇబ్బంది లు లేకుండా ఏర్పాట్లు పనులు చేయించడం జరుగు తుందని నిర్వాహకులు జగదీష్ గౌడ్ , శంకర్ గౌడ్ , రామచందర్ గౌడ్ పేర్కొ న్నారు. ఆలయ పరిసరాలను శుభ్రం చేసే పనులు చేస్తున్నారు. జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్నీ ఏర్పాట్లు చేస్తున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు.

# సీఎం సభకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలి

- కలెక్టర్ కోయ శ్రీహర్ష
- రేపు కోస్గికి ముఖ్యమంత్రి రాక
- పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు, బహిరంగ సభ

**కోస్గి :** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ నెల 21న (బుధవారం) కోస్గి పర్యటన సందర్భంగా పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. సోమవారం అదనపు కలెక్టర్లు మయాంక్ మిత్తల్, అశోక్ కుమార్ తో కలిసి ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ముందు గల కాలేజీ గ్రౌండ్ స్థలాన్ని పరిశీ లిం చారు. అదే స్థలంలో పలు అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయను న్నార ని, అందుకు అవసరమైన శిలా ఫలకాలను సిద్ధం చేయా లని అధికారులను ఆదేశించారు. అక్కడే స్టాల్స్ ఏర్పాటు పై డీఆర్ డీ ఏ అధికారులకు పలు సూచనలు చేశారు. ముఖ్య మంత్రి ప్రారంభోత్సవాలు శంకుస్థాపనల అనంతరం మహి ళా స్వశక్తి సంఘాలతో నిర్వహించే సమావేశానికి అనువైన వేదికను





ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించిన ప్రోటోకాల్ పై రెవెన్యూ, ఆర్ అండ్ బీ , పంచాయతీరాజ్, తదితర శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రోటోకాల్ విషయంలో ఎలాంటి పొర పాట్లకు తావివ్వకుండా క్షుణ్ణంగా పరిశీలించి శిలా ఫలకాలను ప్రాధాన్యత క్రమంలో ఏర్పాటు చేయా లన్నారు. అన్ని శిలాఫలకాలపై ఒకే రకమైన అక్షరాలు ఉండేలా చూడా లన్నారు. ముఖ్యమంత్రి పర్యటనకు కేవలం ఒకేరోజు సమయం ఉన్నందున మైదానంలో వేదిక, శిలాఫలకాలు, స్టాల్స్ పనులను వేగంగా చేయాలని ఆదేశించారు.

**బందోబస్తు ఏర్పాటు చేయాలి : ఎస్పీ**

తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోస్గి పర్యటన సందర్భంగా వివిధ అభివృద్ధి పనులు , శంకుస్థాపనలు చేయు సందర్భంగా భారీ బందోబస్తు ఏర్పాటు చేయాలని ఎస్పీ యోగేష్ గౌతమ్ అధికారులను ఆదేశించారు. సోమవారం అదనపు కలెక్టర్ మయాంక్ మిత్తల్ తో కలిసి బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించారు. హెలీప్యాడ్, సభా స్థల ప్రాంగణం వద్ద బరికేడ్స్ ఏర్పాటు, పార్కింగ్ స్థలాలను పరిశీలించి ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు . ఈ కార్యక్రమంలో డీఎస్పీ ఎన్ లింగయ్య, కోస్గి సీఐ సోమ నర్సయ్య, ఎస్‌బీ సీఐ రామ్ లాల్, ఎస్ఐలు శేఖర్ గౌడ్, రామ్ లాల్ తదితరులు పాల్గొన్నారు.

# సమాజసేవను అలవర్చుకోవాలి : ఎంఈఓ

**అలంపూర్ :** నేటి యువత సమాజసేవ అలవర్చుకోవాలని మండల విద్యాధికారి అశోక్ కుమార్ అన్నారు. సోమవారం సమసమాజ సేవా ట్రస్టు ఆధ్వర్యంలో అలంపూర్ బాలికల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చత్రపతి శివాజీ 394 వ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా చత్రపతి శివాజీ చిత్రపటానికి ట్రస్టు సభ్యులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి అలంపూర్ మండల విద్యాశాఖ అధికారి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. చత్రపతి శివాజీ 1630 ఫిబ్రవరి 19న జన్మించారని, ప్రజల కొరకు ప్రభువు అన్న రీతిలో గొప్ప పరిపాలన చేశాడని, మత సామరస్యం కోరుకున్నాడని, పరమతం పట్ల గౌరవం కలిగిన వ్యక్తిగా ఉండేవారని అన్నారు. ఆయన సైన్యంలో కులాలకు అతీతంగా సైనికులుగా పనిచేశారని, శూద్ర కులాల ప్రజలకు ఆయుధం, ఆత్మగౌరవం అందించి బహుజన రాజ్యాధికారం కోసం శ్రమించిన గొప్ప చక్రవర్తిని అన్నారు. చత్రపతి శివాజీ జయంతి కార్యక్రమాన్ని పురస్కరించుకొని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల(హెచ్) బాలికల జిల్లా పరిషత్ ఉన్నత



పాఠశాల, బాలుర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, న్యూ హై స్కూల్, గురుదేవ్ హై స్కూల్, శారద హై స్కూల్, పదవ తరగతి విద్యార్థిని విద్యార్థులకు 141 మందికి పరీక్ష ప్యాడ్లు, పెన్నులు, స్కేల్‌లను పంపిణీ చేశారు.పదవ తరగతి పబ్లిక్ పరీక్షలలో ఉత్తమ ఫలితాలు సాధించి, మండలానికి, జిల్లాకు మంచి పేరు తేవాలని కోరారు. ప్రజానాట్యమండలి కళాకారులు పాడిన పాటలు సభికులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ట్రస్టు ప్రధాన కార్యదర్శి నాగరాజు, డైరెక్టర్లు వెంకట్రామయ్య శెట్టి, జాన్సన్, రాజు, ఆశన్న, సింగల్ విండో డైరెక్టర్ శ్రీనివాసులు, అనీఫ్, నరసింహ, ఆలీ అక్బర్, అబ్దుల్ హక్, మాబుసాబ్, మాలిక్ భాష, రామకృష్ణ, బలగం నాగరాజు, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# శివాజీ ఆశయసాధనకు కృషి చేద్దాం

- అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు మల్లన్ కోటి శంకర్

**నర్వ/ ఊట్కూర్ :** ప్రతి ఒక్కరూ శివాజీ ఆశయ సాధనకు కృషి చేద్దామని, ధైర్యానికి, ధీరత్వానికి మరో పేరు చత్రపతి శివాజీ మహారాజ్ అని అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు మల్లన్ కోటి శంకర్ అన్నారు. శివాజీ మహారాజ్ జయంతి సందర్భంగా సోమవారం అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో నర్వ మండలంలోని రాయికోడ్ గ్రామంలో శివాజీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నర్వ ఎస్ఐ సీహెచ్ కుర్మయ్య హాజరై గ్రామంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన ఛత్రపతి శివాజి మహారాజ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ యువత చెడు మార్గంలో పయనించకుండా మహనీయుల ఆశయాలను, ఆలోచన విధానాలను అనుసరిస్తూ మంచి మార్గంలో పయనించి ప్రయోజకులు కావాలన్నారు. మహనీయుల జయంతిని రాయికోడు గ్రామ యువ కులతో కలిసి జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. గ్రామంలోని ప్రధాన కూడళ్లలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకునే విధంగా యువత, గ్రామ పెద్దలు కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు ఎం.శంకర్ మాట్లాడుతూశివాజీ సేవలను కొనియాడారు. రైతుల శ్రేయస్సు కోసం అనేక సంస్కరణలు తీసుకువచ్చి



క్రిష్టాలో..




ఊట్కూర్‌లో..

కుల్వాడి భూషణ్‌గా పేరు గాంచిన గొప్ప మహనీయుడి ఆశయ సాధనలో మనమంతా ముందుకు వెళ్దామన్నారు. అలాగే మక్తల్ పట్టణంలోని పడమటి అంజనేయ స్వామి దేవాలయం వద్ద మక్తల్ బజరంగ్దళ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకలను నిర్వహి ంచారు. కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సం ఘం అధ్యక్షులు యం.శంకర్,డాక్టర్ వెంకటేష్, కందుకూరి శ్రీనివాసులు, మ్యాతరి గోపాల్, యం. నారాయణ రెడ్డి,చిన్న ఎల్లప్ప, చిన్న హన్మంతు, సోల వెంకటన్న, మ్యాతరి వెంకటయ్య,డ్రైవర్ ఎల్లప్ప, ఎసెప్,గడ్డమీది ఆనంద్,నర్సింలు,కందుకూరి అనిల్, బాయికాడి భీమేష్, సాయిలు, శివశంకర్, అశోక్, అనిల్ , గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

**క్రిష్టా :** మండల కేంద్రంతో పాటు గుడెబల్లూర్, ఖాన్ దొడ్డి గ్రామాలలో ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ



నర్వలో..

సంద ర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పుర వీధుల గుండా చత్రపతి శివాజీ మహారాజ్ చిత్ర పటాన్ని ఊరేగించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసులు, శక్తిసింగ్, కిష్టప్ప పాల్గొన్నారు.

## ఘనంగా బీరప్ప బండారోత్సవం

**ఊట్కూర్ :** మక్తల్ పట్టణంలో బీరప్ప బండారోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు.మక్తల్ పట్టణంలో ప్రారంభమైన బీరప్ప బండారోత్సవ కార్యక్రమంలో మక్తల్ నియోజకవర్గ శాసనసభ్యులు వాకిటి శ్రీహరి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే మక్తల్ నియోజకవర్గ మాజీ శాసన సభ్యులు చిట్టెం రామ్మోహన్‌రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అదేవి ధంగా





మక్తల్ మండలంలోని కా ట్రపల్లిలో బీరప్ప దేవాలయంలో నూతన గురడ స్తంభ ప్రతిష్టాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో బీఆర్ఎస్ నాయకులు రాజుల ఆశి రెడ్డి , ఈశ్వర్ యాదవ్ , అమ్మ పల్లి నరసింహ, మక్తల్ నియోజవర్గ మాజీ శాసనసభ్యులు చిట్టెం రామ్మో హన్ రెడ్డి , బీఆర్ఎస్ నాయకులు రాజుల ఆశి రెడ్డి ఈశ్వర్ యాదవ్ , స్థానిక మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## సీసీరోడ్ పనులు ప్రారంభం



**ఊట్కూర్ :** మండలంలోని ఓబ్లాపూర్ గ్రామంలోని బీసీ కాలనీలో ఎన్ఆర్ఈజీఎస్‌లో భాగంగా ఐదు లక్షల నిధులతో సీసీరోడ్ నిర్మాణం పను లను పీఏసీఎస్ మాజీ చైర్మన్ ఎల్కోటి నారాయణరెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్థానిక మాజీ ఉపసర్పంచ్ కాంగ్రెస్ యువ నాయకుడు వెంక టేష్ గౌడ్, అనంత రాములుగౌడ్, శంకరప్ప,అశోక్, రామచందర్ , బాలలింగప్ప , భీంశ్మప్ప, ఎల్లప్పలతో పాటు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభి మా నులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ కార్యకర్తను పరామర్శించిన ఎమ్మెల్యే



**ధరూర్ :** గద్వాల నియోజకవర్గం ధరూర్ మండలంలోని ఉప్పేర్‌లో పర్యటనలో భాగంగా బీఆర్ఎస్ కార్యకర్త ముక్తార్ ఆలీ అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ విషయం తెలుసుకుని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు. యోగక్షేమాలను అడిగి తెలుసు కున్నారు. ధైర్యంగా ఉండాలని అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఎమ్మెల్యే వెంబడి జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ జంబు రామన్ గౌడు, ఎంపీపీ విజయ్, బీఆర్ఎస్ నాయకులు కృష్ణారెడ్డి, వెంకటేశ్వర్ రెడ్డి, రఘువర్ధన్ రెడ్డి, ప్రభాకర్ గౌడ్, హనుమంతు, కురుమన్న , నాయకులు , కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## తహసీల్దార్‌గా సలీముద్దీన్

**ఉండవల్లి :** ఉండవల్లి తహసీల్దార్‌గా సలీముద్దీన్ బాధ్యతలు స్వీకరించారు.తహసీల్దార్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న వెంకట్రావును నాగర్ కర్నూల్ జిల్లాకు బదిలీ చేసినట్లు తెలి పారు . ఆస్థానంలో నూతన తహసీల్దార్‌గా సలీముద్దీన్ నియమించినట్లు ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు జారీ కావడంతో బాధ్యతలు చేపట్టినట్లు తెలిపారు.

## జేసీబీ, ట్రాక్టర్ల పట్టివేత



**గట్టు :** ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా మట్టిని తరలిస్తున్న జేసీబీ,ట్రాక్టర్ల ను పట్టు కున్నట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. గట్టు గ్రామ శివా రులో , తప్పట్ల మోర్సు గ్రామ శివారులోని గట్టు గ్రా మానికి చెందిన రెండు జేసీబీలు, నాలుగు ట్రాక్టర్లు పట్టుకున్నట్లు తెలిపారు. తదుపరి చర్యల నిమిత్తం మైనింగ్ డిపార్ట్మెంట్ అప్పజెప్పినట్లు ఎస్సై తెలిపారు.

## బీఆర్ఎస్ నాయకుడికి నివాళి



**గట్టు :** మండలంలోని చిన్నోనిపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు కురవ భీమన్న అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందారు. ఈ విషయం తెలిసిన వెంటనే ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి వారి స్వగృహం చేరుకుని ఆయన పార్థీవ దేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎమ్మెల్యే వెంబడి జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ జంబు రామన్ గౌడు, ఎంపీపీ విజయ్ , బీఆర్ఎస్ నాయకులు వెంకటేశ్వర్ రెడ్డి, కురమన్న, మునిచంద్రగౌడ్, నాయకులు పాల్గొన్నారు.

## క్యాన్సర్‌వ్యాధితో బాలుడు మృతి



**నర్వ:** గత కొన్ని రోజులుగా బ్లడ్ క్యాన్సర్‌తో బాధపడుతూ చికిత్సను పొందుతున్న బాలుడు గౌతమ్ సోమ వారం ఉదయం మృతి చెందాడు. నర్వ మండ లంలోని శ్రీపురం గ్రా మానికి చెందిన గీతమ్మ, ఆంజనేయులు దంపతుల రెండవ కుమారుడు గౌతమ్ గత మూడు సంవత్సరాలుగా బ్లడ్ క్యాన్సర్ తో బాధప డుతున్నాడు.రెక్కాడితే గాని డొక్కాడని కుటుంబాన్ని క్యాన్సర్ మహమ్మారి కబలించింది.తమ కుమారుడిని బతికించు కోవాలని కూలిపనులు చేస్తున్న కుటుంబం అప్పుచేసి రూ.7 లక్షల ఖర్చు చేసిన ఫలితం దక్కలేదని తల్లిదండ్రుల రోధనలు మిన్నంటాయి.